ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 12 | సెప్టెంబర్ 2021

## ఈ సంచికలో....

ఓ గాడ్ బ్యూటీఫుల్ ........ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ........ 4


అక్షరమణమాల - ద్విపద 15 ........ 25

భగవద్గీత - శ్లోకం 2-46 ........ 26

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



పంచదార బెల్లం ఒక చోట ఉన్నాయి అనుకోండి, చీమలని రమ్మని పిలవనక్కరలేదు, అవే వచ్చేస్తాయి. అలాగే ఎక్కడైతే రియలైజ్డ్ సోల్ (realised soul) ఉందో అక్కడికి ఆ ఉపాధి ద్వారా ఎవరైతే తరించబడవలసి ఉందో వాళ్ళు అంతా ఆకర్షింపబడతారు.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి.పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం నమో భగవతే శ్రీ రమణాయ/ ఓం శ్రీ నాన్న పరమాత్మనే నమః

# ఓ గాడ్ బ్యూటిఫుల్

మన నాన్నగారికి, మహాత్ముడైన గురునానక్ రచించిన 'ఓ గాడ్ బ్యూటిఫుల్' అనే ప్రార్థన అంటే ఎంతో ప్రీతి. ఈ ప్రార్థనని ఆంగ్లంలోకి అనువాదం చేసి మొదట పాడినవారు పరమహంస యోగానంద. ఈ ప్రార్థనని నాన్నగారు తన్మయత్వంతో పాడుతూ భక్తులను ఆనంద సాగరంలో ఓలలాడించేవారు. ఈ ప్రార్థనకి వివరణ నాన్నగారి అనుగ్రహ వాక్యాల నుండి........

ఓ గాడ్ బ్యూటిఫుల్, ఓ గాడ్ బ్యూటిఫుల్,
ఓ గాడ్ బ్యూటిఫుల్, ఓ గాడ్ బ్యూటిఫుల్, ఐ డూ బొవ్ ఎట్ థై ఫీట్!
దౌ ఆర్ గ్రీన్ ఇన్ ది ఫారెస్ట్;
దౌ ఆర్ హై ఇన్ ది మౌంటెన్;
దౌ ఆర్ రెస్ట్‌లెస్ ఇన్ ది రివర్;
దౌ ఆర్ గ్రేవ్ ఇన్ ది ఓషన్;
ఓ గాడ్ బ్యూటిఫుల్, ఓ గాడ్ బ్యూటిఫుల్, ఐ డూ బొవ్ ఎట్ థై ఫీట్!
దౌ ఆర్ సర్విస్ టు ది సర్విస్ఫుల్;
దౌ ఆర్ లవ్ టు ది లవర్;
దౌ ఆర్ సింపతీ టు ది సారోఫుల్;
దౌ ఆర్ బ్లిస్స్ టు ది యోగి;
ఓ గాడ్ బ్యూటిఫుల్, ఓ గాడ్ బ్యూటిఫుల్, ఐ డూ బొవ్ ఎట్ థై ఫీట్!
దౌ ఆర్ గ్రీన్ ఇన్ ది ఫారెస్ట్; దౌ ఆర్ హై ఇన్ ది మౌంటెన్ -
అంటే ఈశ్వరుడు అడవిలో పచ్చగా ఉంటాడటండీ; కొండలలో ఎత్తుగా ఉంటాడటండీ.

**దౌ ఆర్ రెస్ట్‌లెస్ ఇన్ ది రివర్ -**

ఈశ్వరుడు నదిలో ప్రవాహంగా ఉన్నాడు. నదిలో ప్రవాహం ఎక్కడా ఆగకుండా వెంటనే వెళ్లిపోతూ ఉంటుంది. అంటే మన సాధన అలా ఉండాలి. మేము పూజ చేస్తాం రెండు నిమిషాలు ఆగు, జపం చేస్తాము రెండు నిమిషాలు ఆగు అంటే నదిలో ప్రవాహం ఆగదు, దాని ప్రవాహమే దాని ప్రవాహం. దాని చూపే దాని చూపు, దాని వేగమే దాని వేగం. ఎన్ని వంకర్లు తిరిగినా సముద్రంలో కలవటానికి పరుగెడుతూనే ఉంటుంది. నది విశ్రాంతి తీసుకోదు, అలాగే నీ సాధనలో కూడా నీవు విశ్రాంతి తీసుకోవద్దు.

**దౌ ఆర్ డీప్ ఇన్ ది ఓషన్; దౌ ఆర్ గ్రేవ్ ఇన్ ది ఓషన్ -**

ఈశ్వరుడు సముద్రంలా లోతుగా ఉన్నాడు. సముద్రం చాలా లోతుగా ఉంటుంది. నీవు పైపైన ఈదటం కాదు లోపలికి దిగిన వాడికి ఆత్మముత్యం తెలుస్తుంది. పైపైన ఈదిన వాడికి లోపల ఆత్మముత్యం తెలియదు. లోపల మునిగిన వాడికి లోపల ముత్యం తెలుస్తుంది.

సముద్రం ఎంత లోతుగా ఉంటుందో, ఎంత గంభీరంగా ఉంటుందో, నీ జీవితం కూడా అంతా లోతుగా గంభీరముగా ఉండాలి.

**దౌ ఆర్ సర్విస్ టు ది సర్విస్ఫుల్; దౌ ఆర్ లవ్ టు ది లవర్ -**


నిష్కామ కర్మ చేసేవారిలో, సేవ చేసే వారిలో, సేవాగుణ రూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. భక్తులలో, ప్రేమికులలో ఉన్న ప్రేమ కూడా ఈశ్వరుడే.

**దౌ ఆర్ సింపతీ టు ది పూర్; దౌ ఆర్ సింపతీ టు ది సారోఫుల్ -**

ఎవరైనా బాధ పడుతున్నారు అనుకోండి, దుఃఖ పడుతున్నారు అనుకోండి, వాళ్ళకి సహాయము చేయాలనే బుద్ధి మీకు కలిగింది అనుకోండి, ఆ బుద్ధి ఎవరు అనుకొంటున్నావు? ఆ బుద్ధి ఈశ్వరుడే. నీ అహంకారము అటువంటి బుద్ధిని కలుగచేస్తుందా! అటువంటి మంచి బుద్ధిని కలుగ చేసేవాడు ఈశ్వరుడే. ఎవరైనా ఇతరులు కష్టాలలో ఉన్నప్పుడు, నష్టాలలో ఉన్నప్పుడు, బాధలలో ఉన్నప్పుడు, వాళ్ళకి ఏదైనా సహాయం చేయాలనే బుద్ధి నీకు కలిగింది అనుకో, ఆ బుద్ధి ఈశ్వరుడే!

**దౌ ఆర్ బ్లిస్స్ టు ది యోగి; దౌ ఆర్ పీస్ టు ది యోగి -**

యోగులు మహర్షులు వాళ్ళు ఆనందించే ఆనందం ఎవరనుకుంటున్నావు. వాళ్ళ ఆనంద రూపంలో, శాంతి రూపంలో, జ్ఞాన రూపంలో, ఉండేది ఎవరు, ఈశ్వరుడే! ఈశ్వరా, నీవే వాళ్ళ ఆనందరూపంలో ఉన్నావు. శాంతి రూపంలో ఉన్నావు. యోగులు, మహర్షులలో జ్ఞానం ఎవరు? ఓ ఈశ్వరా! నీవే అక్కడ జ్ఞాన రూపంలో ఉన్నావు. జ్ఞానం నీవే!



**O God Beautiful; O God Beautiful;**
**O God Beautiful; O God Beautiful; I do bow at Thy feet.**

**Thou are green in the forest;**
**Thou are high in the mountain;**
**Thou are restless in the river;**
**Thou are grave in the ocean.**
**O God Beautiful; O God Beautiful; I do bow at Thy feet!**

**Thou are service to the serviceful;**
**Thou are love to the lover;**
**Thou are sympathy to the sorrowful;**
**Thou are bliss to the yogi.**
**O God Beautiful; O God Beautiful; I do bow at Thy feet!**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 25 మార్చి 1984, పడ్లవానిపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

నేను గురువునని మీలో కొంతమంది అనుకోవచ్చు కానీ యదార్థం చెప్పాలంటే మీరు అందరూ నాకు గురువులే. మీరు అందరూ కూడా నా గురువులు. నేనేదో ఎక్కువ వాడిని అని, ఆధ్యాత్మికంగా మీ అందరి కంటే ఎక్కువ స్థితిలో ఉన్నానని నాకంటే మీరు తక్కువ స్థితిలో ఉన్నారని నేను అనుకుంటే నేను చెప్పటానికి పనికి రాను. ఇక్కడ కూర్చోవటానికి కూడా పనికిరాను. ఉన్నది ఒక్కటే వస్తువు, సద్వస్తువు, అదే ఆత్మ. కొంతమందికి మానసిక స్థాయి మంచి స్థితిలో ఉండవచ్చు, కొంతమందికి కొంచెం వెనక స్థితిలో ఉండవచ్చు. అంతేగాని ఉన్నది ఒక్కటే. పరమేశ్వరుడు హృదయంలో ఏముందో, నా హృదయంలో ఏముందో, రమణస్వామి హృదయంలో ఏముందో, మీలోను అదే ఉంది. అందులో ఏమి సందేహ పడక్కర్లేదు. భౌతికంగా అంటారా మేము ఎంతో పైకి వెళ్లాం అని అనుకుంటారు కొంతమంది, పైకి వెళ్లిన వాళ్ళు కింద పడిపోవటం తప్పదు. ఇది నేను చెప్పటం లేదు. అయోధ్యకాండలో రాముడు తన తమ్ముడు భరతుడుతో చెప్పిన మాట ఇది. భౌతికమైన స్థాయి అలా ఉంటుంది. జీవితంలో ఆధ్యాత్మికంగా ఎంత అభివృద్ధి చెందామో అదే నిజమైన సుఖం. అదే నిజమైన ఆనందం. మన మనస్సు ఎంతవరకు వికసించిందో అదే నిజమైన ఆనందం. మనం అందరం చేసే పొరపాటు ఒక్కటే శరీర ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్త పడుతున్నాము. కాని మన మానసిక ప్రవర్తన, మానసిక ఆరోగ్యం, అది మనం పట్టించుకోవట్లేదు. మానసిక ప్రవర్తనని ఎవరైతే అదుపు చేసుకుంటున్నారో, ఎవరైతే మానసిక ఆరోగ్యాన్ని బాగుచేసుకుంటున్నారో వాళ్ళు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి వస్తారు. నా మనసులో ఏమి జరుగుతోందో నేను పరిశీలించనప్పుడు నేను ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావటానికి అవకాశం లేదు. మనం అభివృద్ధిలోకి వచ్చినా, పతనం అయినా దానికి ముందు మనసు కారణం. మీరు అందరూ నాకు గురువులు. ఎలా గురువులు? మీరు ఆసక్తిగా వింటుంటే నేను చెప్పగలను. మీరు ఆసక్తిగా వినరు అనుకోండి నేను ఎవరికి చెపుతాను? మీరు ఎంతో ఆసక్తితో వింటున్నారు కాబట్టి మీరు అందరూ నాకు గురువులు. ఏదో గౌరవం కోసం నేను చెప్పటం కాదు, నా హృదయంలో ఉన్నదే చెబుతున్నాను. ఒకటి శరీరం, రెండు మనస్సు, మూడు వాక్కు. ఈ మూడింటిలో ఏది తేడా వచ్చినా ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందదు. హృదయంలో ఏముందో

మనసులోకి అదే రావాలి. మనసులో ఏముందో నోటితోటి అదే చెప్పాలి. నోటి తోటి ఏది చెబుతున్నామోచేతితోటి అదే చెయ్యాలి. ఈ క్రమంలో ఏది తేడా వచ్చినా, ఎక్కడ పొరపాటు వచ్చినా, ఎక్కడ అపశ్రుతి వచ్చినా వాడు ఆధ్యాత్మికంగా పతనం అయిపోతాడు. అభివృద్ధిలోకి రావటానికి అవకాశం లేదు. అందుచేత purity of thought, purity of body, purity of speech, purity of action ముఖ్యం. కేవలం ధ్యానం ఒక్కటే సరిపోదు. సత్కర్మ కూడా చెయ్యాలి. మనం ప్రపంచంలోకి ఎందుకు వచ్చాం? మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావటానికి భగవంతుడు ఒక అవకాశం ఇచ్చాడు. ఈ అవకాశాన్ని ఎవ్వరూ కూడా దుర్వినియోగం చేసుకోవద్దు. సద్వినియోగం చేసుకోండి. ఏ నామం అయినా సరే మీకు ఇష్టమొచ్చిన నామం ఎంచుకోండి. రామ నామమో, కృష్ణనామమో, శివ నామమో, ఏదో ఒక నామాన్ని శ్రద్ధగా మననం చేయండి.

తులసీదాసు ఒక మాట చెప్పాడు. ఒక గదికి, ఇంకొక గదికి మధ్యన గడప ఉంటుంది. ఆ గడప మీద కనుక దీపం పెట్టుకుంటే, రెండు గదులకి కూడా వెలుతురు పడుతూ ఉంటుంది. ఆ గడప మీద దీపం ఏ విధంగా అయితే రెండు గదులకి సమానమైన వెలుతురు ఇస్తుందో, అదే విధంగా నా నోటిలో ఎప్పుడూ కూడా రామ నామమే స్మరించుకుంటూ ఉంటే, నా నాలుక మీద ఎప్పుడూ రామ నామమే కాపురం ఉంటే, ఈ రామ నామం లోపలకి, బయట పరిసరాలకి కూడా వెలుతురుని ఇస్తుంది అన్నాడు తులసీదాసు. ఇది నా సొమ్ము కాదు, ఇది తులసి దాసు సొమ్ము. అది మీకు అందజేస్తున్నాను. మనకున్న సంతోషంలో వాటా పంచి పెట్టాలి కాని మనకున్న దుఃఖంలో వాటా పంచిపెట్టటం మంచిది కాదు. మన భారతదేశంలో ఉన్న మహాత్ములను మనం చూసుకుంటే వాళ్లకి కూడా దుఃఖాలు ఉన్నాయి. అయితే వాళ్ళు దుఃఖాన్ని దాచుకున్నారు, వాళ్ళకున్న సంతోషాన్ని పంచి పెట్టారు. మహాత్ముల లక్షణం ఇది. అల్పుడు ఏమి చేస్తాడు అంటే వాడికున్న దుఃఖాన్ని సమాజానికి పంచి పెడతాడు. వాడికి ఏమైనా లాభం వచ్చినా, సంతోషం వచ్చినా వాడు ఉంచేసుకుంటాడు. ఇది అల్పుడి లక్షణం. జ్ఞానం, జ్ఞానం అంటే మనం పుస్తకాలలో చదివే

**భగవంతుడు మనకి ఇచ్చిన అవకాశాలను ఉపయోగించుకొంటే ఉత్తమజన్మలు వస్తాయి, ఇచ్చిన అవకాశాలను పాడుచేసుకొంటే నీచ జన్మలు వస్తాయి.**



జ్ఞానం అది జ్ఞానం కాదు. ఆత్మను దర్శించడమే జ్ఞానం. ఉన్నదానిని ఉన్నట్టుగా తెలుసుకోవడమే జ్ఞానం. ఎవరైతే సత్యాన్ని తన అనుభవంలోనికి తెచ్చుకున్నారో వారే జ్ఞాని అవుతాడు. ఉన్నది ఉన్నట్లుగా మనం తెలుసుకునే వరకు లేనిది ఉన్నట్లుగా కనిపిస్తుంది. వాసుదేవ స్వామిని ఎవరో అడిగిన ప్రశ్న ఏమిటంటే జ్ఞానికి మరణించిన తరువాత, జ్ఞానికి కూడా ప్రాణం పోతుంది కదా. ఆ ప్రాణం ఎక్కడకు వెళుతుంది? మనం అంటే ఏదో ఒక దేహంలో ప్రవేశిస్తాం. లేకపోతే ఇంకొక లోకంలోకి వెళతాం. కాని జ్ఞాని మాట ఏమిటి అని అడిగారు వాసుదేవ స్వామిని. మన దేహం మరణించిన తరువాత జీవుడు (ప్రాణం) వేరొక దేహంలో ప్రవేశిస్తాడు లేకపోతే వేరే లోకంలోనికి వెళతాము. మరి జ్ఞాని దేహం మరణించినప్పడు ఆ ప్రాణం ఎక్కడకు వెళుతుంది అని అడుగుతున్నారు. ఎందుకు చెబుతున్నాను అంటే ఈ మాట, రమణస్వామికి తన పదహారో సంవత్సరంలో మృత్యువు యొక్క అనుభవం కలిగింది. మృత్యువు యొక్క అనుభవం ఎప్పుడైతే కలిగిందో, కాళ్లు కట్టెలు వలె అయిపోయాయి, శరీరం బిగుసుకుపోయి మొత్తం శరీరం అంతా కూడా కర్రలాగా అయిపోయింది. శ్వాస ఆగిపోయింది, శరీరం అంతా శవం కింద అయిపోయింది. శరీరం మరణించింది, శరీరాన్ని స్మశానానికి తీసుకు వెళతారు, కట్టెలు పెట్టి కాలుస్తారు, బూడిద అయిపోతుంది. శరీరం మరణించింది కదా, మరి నేను మరణించటం లేదే. ఎందుచేత నేను మరణించటం లేదు? మరి శరీరం మరణించింది కదా నేను అలాగే ఉన్నానే. నా అస్థిత్వానికి ఏమి లోటు లేదే, మరి ఎవరు మరణించారు? శరీరం మరణించింది. మరి శరీరం మరణిస్తే నేను ఎందుకు మరణించటం లేదు? శరీరం నేను కాదు కాబట్టి, నేను ఎవరిని? ఆత్మని. ఆత్మకి మరణం లేదు. శరీరం జన్మిస్తుంది కాబట్టి మరణిస్తుంది. మరణం లేని వస్తువు నిత్యంగా ఉండే వస్తువు ఈ శరీరానికి, దానికి అణుమాత్రం కూడా సంబంధం లేని వస్తువు. మీకు ఎపుడైతే అంతర్ముఖ దృష్టి కలిగిందో, మీ మనస్సు లోపలికి ఎప్పుడైతే దిగిందో, ఆత్మని ఎప్పుడైతే తాకిందో, అది ఎప్పుడైతే అక్కడ స్థిర పడిందో, అప్పుడు జ్ఞాన సింహాసనం అధిష్టిస్తారు.

పింది కాయ అవుతుంది, కాయ పండు అవుతుంది. పండు అయిన తరువాత రాలి పడుతుంది. ఇందులో లోక విరుద్ధం ఏమైనా ఉందా? ఇది ప్రకృతి సహజం. దీనిలో లోక విరుద్ధం ఏమిలేదు. అందులో ఏముంది అని అనుకుంటాము మనం. అలాగే మన శరీరం, పిల్లవాడి లాగే మనం ఉన్నామా? పెద్దవాళ్లం అయ్యాం, తరువాత శరీరం రాలిపోతుంది. ఇందులో లోక విరుద్ధం ఏముంది? మరి ఎందుకు మన శరీరం పడిపోతే భయం వేసినట్టు

ఎందుకు అనిపిస్తుంది? కొంతమంది మనుషులు ఎదుటి మనుషులని చూసి అసహ్యించుకుంటారు. అది చాలా పొరపాటు. ఎదుటి మనుషులని చూసి అసహ్యించుకోవడం ఒకటి, సిగ్గు ఒకటి, భయం ఒకటి. ఇవి మూడు మంచివి కాదు. ఇవి మూడు ఒకవేళ మీలో ఉంటే విడిచి పెట్టేయండి. మీరు జ్ఞానులు కండి, జ్ఞానికి బంధువులు అవ్వద్దు అని వశిష్టుడు చెప్పాడు. ఈ సృష్టిలో ఏమి దోషం లేదు, దృష్టిలో దోషం ఉంది. ఎప్పుడైనా మీ మనసు శాంతిగా ఉంది అనుకోండి మాటవరసకి. అబ్బా ఎంత ప్రశాంతంగా ఉందో ఈ లోకం అనుకుంటారు. మన మనసులో దుఃఖం ఉంటే లోకం అంత దుఃఖంగా కనిపిస్తుంది. ఈ సృష్టిలోనా దోషం? కాదు నీ దృష్టిలోనే దోషం? నేను చెప్పాను అని మీరు నమ్మకండి. మీ అనుభవంలో చూసుకోండి. మీ మనస్సు శాంతిగా ఉంటే లోకం శాంతిగా ఉన్నట్టు అనిపిస్తుంది. మీ మనస్సు దుఃఖంలో ఉంటే లోకం అంతా దుఃఖంలో ఉన్నట్టు అనిపిస్తుంది. ఈ లోకం అంతా కూడా మన మనస్సు యొక్క కల్పితం కాబట్టి మన మనసులో ఏముంటే అదే కనిపిస్తుంది. ఒక్క లోకమే కాదు దేహం కూడా మనస్సు యొక్క కల్పితమే!

ఎవరో అన్నారు ఈ మధ్యన మీ హిందూమతంలో ఇన్ని మార్గాలు ఏమిటి? ఇన్ని దేవతలు ఏమిటి అని, అప్పుడు నేను అన్నాను లోకంలో మూడు వందల కోట్ల దేహాలు ఉన్నాయి కదా ఏ రెండు దేహాలు అయినా ఒకలాగ ఉన్నాయా? ఈ శరీరాలలో ఒక శరీరానికి, ఇంకొక శరీరానికి ఎంత భిన్నంగా ఉన్నాయో, అలాగే మూడు వందల కోట్ల మందికి మూడు వందల కోట్ల మనస్సులు. అందుచేత ధ్యానం యోగం, భక్తి యోగం, కర్మ యోగం, ఆ యోగం, ఈ యోగం ఇలా అనేకం చెప్పారు. ఎందుచేతనంటే కొంతమందికి ఇష్టమైనది ఎలా ఉంటుందో, అలాగే ఇష్టమైన మార్గం వాళ్ళు ఎంచుకుంటారు. మీరు బాగుపడటం ముఖ్యం. మీరు అందరు రమణభక్తులు అయిపోవాలి అని నేను కోరుకోవటం లేదు. మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావాలని, ఉన్నత స్థితిలోకి రావాలని నేను కోరుకుంటున్నాను. మీరు ఏ రూపాన్ని ఆరాధిస్తున్నారో, ఏ నామాన్ని స్మరిస్తున్నారో అది ముఖ్యం కాదు నాకు, మీ అభివృద్ధి ముఖ్యం. అన్నదమ్ములు విడిపోతారు, భార్యాభర్తలు విడిపోతారు, తల్లి పిల్లలు విడిపోతారు. ఎప్పుడైతే సంయోగం వచ్చిందో వియోగం కూడా తప్పదు. నది ప్రవాహంలో కర్రలు వెళుతుంటే చూడండి. అవి కలిసి కొట్టుకు వెళుతూ ఉంటాయి అలా. మళ్ళీఏ కెరటమో వస్తుంది. ఆ కర్ర అలా వెళ్ళి పోతుంది, ఈ కర్ర ఇలా వెళ్ళి పోతుంది. ఈ జీవి కూడా అంతే అన్నారు రమణస్వామి. సంయోగం ఎప్పుడైతే వచ్చిందో వియోగం కూడా తప్పదు. అదేవిధంగా ఒక ఇంట్లోని మనుషులు కూడా అంతే. ఏదో

కొంతకాలం కలిసి ఉంటారు. తరువాత విడిపోయి ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. దీనిని ఎవరు తప్పించలేరు. జీవితం. అందుచేత మీరు ఏమి దుఃఖ పడకండి. దేని గురించి దుఃఖ పడకండి. మీరు నిరాశ చెందకండి.

రాముడి మాటలు చాలా పొందికగా ఉంటాయి, చాలా మర్యాద గల పురుషోత్తముడు అని చెప్పాడు తులసీదాసు. మన ఎదురుగా ఎవరైనా కనిపిస్తే ముందు వాడు మాట్లాడిన తరువాత మనం మాట్లాడాలి అనుకుంటాం. ఎందుచేత? ముందే మనం మాట్లాడితే మన అహంకారానికి భంగం వస్తుందేమో అని. శ్రీ రాముడు ఒక చక్రవర్తికి అల్లుడు. ఒక చక్రవర్తికి కొడుకు. ఆయన అయోధ్యలో ఎక్కడైనా రోడ్డు మీద పనిమీద వెళుతుంటేముందు ఆయనే పలకరించేవారు అట. ఒక రహస్యం మీ మనసులో పెట్టుకోండి. ఎవరికీ చెప్పకండి. మన అస్థిత్వం దేహానికే పరిమితం అయి ఉన్నంతకాలం, నాకు కోరికలు ఉన్నంతకాలం నేను మరణించిన తరువాత నా ప్రాణం, ఇతర శరీరాలలోకి, ఇతర లోకాలలోకి తప్పనిసరిగా ప్రయాణం చేస్తుంది. కోరికలు విడిచి పెట్టినవాడు పరబ్రహ్మాలో కలుస్తాడని చెప్పలేదు. కోరికని నిగ్రహించుకున్న వాడు కాని, కోరికని అణిచిపెట్టుకున్న వాడు కాని పరబ్రహ్మాలో కలుస్తాడని చెప్పలేదు. వాసనాసహితంగా కోరికని ఎవడైతే విడిచి పెడతాడో వాడు పరబ్రహ్మాలో ఐక్యం అవుతాడు. వాడి ప్రాణం ఎక్కడకు పోదు. ఆ జీవుడు ఎక్కడికి ప్రయాణం చేయడు. ఇతర లోకాలకి వెళ్ళటానికి, ఇతర దేహాలకి వెళ్ళటానికి అక్కడ ఏమి లేదు. ఆ శరీరం ఉండగానే ఎప్పుడైతే వాసనాసహితంగా కోరికలు అన్నీ మాడిపోయాయో, అప్పుడు ఆ ప్రాణంపరబ్రహ్మాలో లీనం అవుతుంది. ఎప్పుడు? దేహం ఉండగానే. ఆ స్థితి రమణస్వామి పదహారవ సంవత్సరంలో పొందాడు అని చెప్పటానికి ఇంత చెప్పవలసి వచ్చింది. ఎప్పుడైతే వాసనాసహితంగా మన కోరికలను విడిచి పెట్టగలుగుతామో, ఆ క్షణంలో మనం కూడా స్వరూపాన్ని పొందుతాము. ఏదో పది నిమిషాలు పూజ చేశాం, ఏదో పది నిమిషాలు జపం చేశాం, అంటే సరిపోదు. ప్రతి నిమిషం, ప్రతి గంట నిఘా వేసుకొని చూసుకోవాలి. మనకున్న జీవ లక్షణాలు పోయేలా చూసుకోవాలి. నేను అవసరం లేని మాటలు మాట్లాడుతుంటే నాకు జీవ లక్షణాలు పెరుగుతాయి. మనం ఆడంబర జీవితానికి అలవాటు పడ్డాము. మాటలో ఆడంబరం, వేషంలో ఆడంబరం, చేష్టలో ఆడంబరం, ప్రవర్తనలో ఆడంబరం, ఇలా జీవితం పొడవునా దైనందిన జీవితంలో ఎవడైతే ఆడంబర జీవితానికి అలవాటు పడిపోయాడో, వాడు ఎన్ని పూజలు చేసినా, ఎన్ని జపాలు చేసినా, ఎన్ని క్రతువులు చేసినా, ఎన్ని నోములు నోచినప్పటికి వాడికి జీవ లక్షణాలు

పెరుగుతూనే ఉంటాయి. నా మాట కాదు అనకండి. భగవంతుడు మీ క్రతువులు చూడడు. దానివల్ల మీకు పుణ్యం వస్తే రావచ్చు అది వేరే విషయం. ఇక్కడ మనం మాట్లాడుకునే మాటలు జ్ఞానం గురించి మాట్లాడుకుంటున్నాం, సత్యం గురించి మాట్లాడుకుంటున్నాం, శాశ్వతమైన వస్తువు గురించి మాట్లాడుకుంటున్నాం, సద్వస్తువు గురించి మాట్లాడుకుంటున్నాం. ఇక్కడ పుణ్యం గురించి పాపం గురించి మాట్లాడుకోవట్లేదు. మీరు పూజలు చేసినా జపాలు చేసినా ప్రయోజనం లేదు ఆడంబర జీవితానికి అలవాటు పడిపోతే. అందుచేత ఆడంబర జీవితానికి మనం దూరంగా ఉంటే జ్ఞానానికి దగ్గరవుతాము, మోక్షానికి దగ్గరవుతాము. మీరు ఏ పని చేసినా ఈశ్వరుడు సంతోషం కోసం చేయండి.

ఒక విషయం మీరు మరచిపోవద్దు. మీ మనసులో ఏమి జరుగుతుందో, మీ హృదయంలో ఏముందో, ప్రతిక్షణం ఈశ్వరుడు చూస్తాడు. నేను ఎందుకు మాట్లాడుతున్నాను? గౌరవం కోసం మాట్లాడుతున్నానా? లేకపోతే ఆడంబరం కోసం మాట్లాడుతున్నానా? ఎందుకు మాట్లాడుతున్నాను అన్నిటికి ఈశ్వరుడు సాక్షిగా ఉండి చూస్తున్నాడు. ఈశ్వరుడు నేనుగా ఉండడు, తానుగా ఉంటాడు, సాక్షిగా ఉంటాడు. ఈశ్వరుడు నాలో ఎక్కువ ఉండడు. మీలో తక్కువ ఉండడు. అందరిలో సమానంగా ఉంటాడు. అందరిలో ఆయన సమానంగా ఉన్నాడు కాబట్టి మనకి కూడా సమాన దృష్టి వస్తేనే ఈశ్వరుడు మనకు అందుతాడు. మన హృదయం బాగానే ఉంది కానీ మన బుద్ధిలో దోషం ఉంది. నా శరీరం కంటే కూడా నాకు ఈశ్వరుడు దగ్గరగా ఉన్నాడు. కాని నాకు దూరంగా ఉన్నాడని అనిపిస్తుంది. ఎందుకు అనిపిస్తుంది? నా బుద్ధిలో దోషం ఉంది. ఎప్పుడు చూసినా సందేహాలే. ఎప్పుడు చూసినా అనుమానాలే. మనసు ఎపుడు స్థిరంగా ఉండటం లేదు. మనసు సందేహాలతో అనుమానాలతో కాలిపోతుంది అని ఒకాయన రమణస్వామితో అన్నారు. జీవుడికి సందేహాలు ఉన్నాయి. ఆత్మకి సందేహాలు



**గురువు సన్నిధిలో, వారితో సంభాషించటం వల్ల,**

**మన లోపల అవ్యక్తంగా ఉన్న వస్తువు**

**వ్యక్తం అవుతూ ఉంటుంది.**

లేవు. నువ్వు ఎవరవు? ఆత్మవు. ఆత్మకు సందేహాలు లేవు, సందేహాలు లేని ఆత్మ యందు నీ మనస్సుని నిలుపు. మనం నేను నేను అంటున్నాం అంటే ఆ నేను దేహానికి పరిమితం అయిన నేను. ఆ నేను అందరికి ఇష్టం. మనం చేసే పూజ, మనం చేసే జపం, మన మనసుతోటి చేసే ధ్యానం మనం చేత్తోటి చేసే దానం వీటి అన్నీటి యొక్క ప్రయోజనం వల్ల ఈ దేహగతమైన నేను, ఈ అహంకార గతమైన నేను, ఈ మనోగతమైన నేను, ఈ నేను గనుక పోకపోతే అంతవరకు మనం ఈ శవాలు మోయవలసిందే. ఆ నేను గనుక కాలి బూడిద అవ్వకపోతే మనం ఎన్ని దేహాలు మోయ్యాలి, ఎన్ని శవాలు మోయ్యాలి, ఎన్ని లోకాలు తిరగాలి, ఎంత దుఃఖం అనుభవించాలి. మీరు పూజ చేస్తే దుఃఖం పోతుంది, జపం చేస్తే దుఃఖం పోతుంది, నోములు నోస్తే దుఃఖం పోతుంది, క్రతువులు చేస్తే దుఃఖం పోతుంది, యజ్ఞాలు యాగాలు చేస్తే దుఃఖం పోతుందని ఎక్కడా ఉపనిషత్తులలో చెప్పలేదు. ఉపనిషత్తులో ఒక మాట చెప్పాడు సనత్కుమారుడు, ఎవ్వడైతే ఆత్మనిదర్శిస్తాడో, ఎవడైతే ఆత్మలాభం పొందాడో వాడు దుఃఖసముద్రాన్ని దాటగలడు. సనత్కుమారుడే రమణస్వామిగా అవతరించాడు అని గణపతి శాస్త్రి గారు చెబుతున్నారు. ఒక్క మాట మీరు జ్ఞాపకం ఉంచుకోండి కేవలం కాషాయ గుడ్డలు కట్టుకుంటే మనం సన్యాసులం అయ్యిపోము. న్యాసం అంటే విడిచిపెట్టటం అని. సన్యాసం బాగా విడిచిపెట్టటం అని. తనకున్న లోక వాంఛలను ఎవడైతే విడిచి పెట్టేశాడో వాడు సన్యాసి. మీరు తెల్ల గుడ్డలు కట్టుకున్నారా? ఎర్ర గుడ్డలు కట్టుకున్నారా? పసుపు గుడ్డలు కట్టుకున్నారా? అని గుడ్డలతోటి మనకు పనిలేదు. ఎక్కడ? లోపలున్న చీకటిని, లోపల ఉన్న కోరికలను పూర్తిగా విడిచిపెట్టు. సగం లోపల పెట్టుకోకు. సన్యాసం అంటే బాగా విడిచిపెట్టు. మళ్ళీ ఏమి శేషం ఉండకూడదు, నిశ్శేషంగా విడిచి పెట్టు. అబద్ధమైన నేనును శేషంతో కాదు, నిశ్శేషంగా విడిచిపెట్టు.

సోదరమహాశయులారా! ఎక్కడ స్వల్పమైన వాంఛ, అల్పమైన వాంఛ, ఇసుమంత వాంఛహృదయంలో ఉన్నప్పటికీ అది జన్మ రాకకు కారణం అవుతుంది. నిరంతరం ఎవడైతే తన మనస్సుని ఆత్మ యందు ఉంచుతున్నాడో, మనస్సు అక్కడ కాలిపోతుంది. మీకు ఏ కారణాల వల్ల దుఃఖం వస్తుందో, ఆ కారణం రాలిపోతుంది. ఎవరైతే నిరంతరం తన స్వరూపాన్ని ధ్యానం చేస్తున్నాడో, ప్రపంచంలో ఎన్ని సముద్రాలు అయితే ఉన్నాయో, ఆ సముద్రంలో ఎంత నీరు ఉందో మనం లెక్క పెట్టచ్చు కాని జ్ఞాని పొందే సుఖం, జ్ఞాని పొందే ఆనందం, జ్ఞాని పొందే శాంతి, మనం కొలవలేము అన్నారు శ్రీ రమణ మహర్షి. ఉన్నది పరమేశ్వరుడు ఒక్కడే అయితే మనకి రెండుగా కనిపిస్తున్నాయి. ఎంతకాలం అయితే

లోపల అజ్ఞానం ఉందో, ఎంతకాలం అయితే లోపల కల్మషం ఉందో, ఎంతకాలం అయితే లోపల దుర్బుద్ధి ఉందో, అంతకాలం మనకి బయట దృష్టి పోదు. మీరు ప్రపంచంలో ఉండి కూడా ప్రపంచానికి చెందకుండా ఉండాలి. లోకంలో ఉండి కూడా లోకానికి చెందకుండా ఉండాలి. అన్నీ చూసి కూడా ఏమి చూడకుండా ఉండాలి. అన్నీ వింటూ కూడా ఏమి వినకుండా ఉండాలి. అన్నీ చేస్తూ కూడా ఏమి చేయకుండా ఉండాలి. అది నేర్చుకో, Naturalstate నేర్చుకో. నిజంగా నేను మీతోటి మాట్లాడుతున్నాను అనుకోండి మాటవరసకి అనుకోండి కాని మనసు సమాధిలో ఉండాలి. అది లేకపోతే నాకు జ్ఞానం లేదు. పూజ చేసినా మనసు సమాధిలో ఉండాలి. జ్ఞానిది natural సమాధిస్థితి, మాట్లాడినా సమాధి స్థితి. రామ, కృష్ణ అని నామం అనచ్చు అది కూడా సమాధిస్థితి. మనలాగా వాళ్ళు అనుకుంటున్నారు దైవనామం అని మీరు ఎవరు అనుకోవద్దు. అది కూడా సమాధిస్థితి. మీరు జ్ఞాపకం ఉంచుకోండి. జీవితంలో జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం రాకూడదు. జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం వచ్చేస్తున్నాయి అనుకోండి మీకు జీవలక్షణాలు వచ్చేస్తాయి. ఎక్కడా అనకండి. మీ మనసులో గోడ కట్టుకోండి. జరిగిపోయిన గొడవలని రానివ్వకండి. అన్నీ మరచిపోండి. ఇప్పటివరకు ఎవరైనా మీకు అపకారం చేస్తే వాళ్ళని క్షమించి, ఆశీర్వదించి వదిలేయండి. అంతా సమాప్తం అయిపోవాలి. మీ ఎదుటివాడు లోకంలో దుష్టుడు అనుకోండి ఆ దుష్టుడు సంగతి భగవంతుడికి తెలుసు. వాడిని భగవంతుడు భరిస్తున్నాడు. అంటే గతించిన పనులు అన్నీ జ్ఞాపకం వస్తుంటే, గతించిన గొడవలు అన్నీ నీ మనసుని వెక్కిరిస్తూ ఉంటే మీ మనసు ఆత్మ వైపుకు మళ్ళదు.

మనం చేయవలసింది లోకచింతన కాదు, ఆత్మచింతన. ఆత్మచింతన చేయగా చేయగా వాడు ఆత్మ అవుతాడు. బ్రహ్మచింతన చేయగా చేయగా బ్రహ్మము అవుతాడు. ఏది చింతిస్తే అదే అవుతాడు వాడు. మీరు ఏ పని చెయ్యనివ్వండి ఏది మన కేంద్రం అంటే మన దేహమే మన కేంద్రం. మన అనుభవం అంతే కదా దేహమే మన కేంద్రం. దేహమే ప్రధానం. ఈ దేహమే ప్రధానంగా పెట్టుకొని నిరంతరం దీనినే స్మరిస్తూ మనం పని చేస్తాం. ఎప్పుడైతే స్థూల శరీరాన్ని ఆధారంగా పెట్టుకొని ఆలోచిస్తూ, పనిచేస్తూ, మాట్లాడుతూ, మన దైనందిన జీవితం ఎప్పుడైతే ఇలా గడుపుతున్నామో, పచ్చ గడ్డి తిన్న దూడలా లోపల సూక్ష్మ శరీరం బలపడిపోతుంది. ఎప్పుడైతే ఈ దేహాన్ని కాదని ఈ దేహ బుద్ధి నాకు పోయి కేవలం ఆత్మ బుద్ధి తోటి ఎప్పుడైతే నేను పనిచేయటం ప్రారంభించానో అప్పుడు మనస్సుకు Food supply ఆగిపోతుంది. దేనికి? లోపల ఉన్న మనస్సుకి, అజ్ఞానానికి

supply ఆగిపోతుంది. అలా Supply ఆగిపోయి కృశించిపోయి రాలిపోతుంది. నాకు దేహబుద్ధి పోకుండా, లోపల ఉన్న అజ్ఞానాన్ని ఆపరేషన్ చేసి తీసేస్తే అది రాదు. చిత్త శోధకం, ముక్తి సాధకం ఏమి చెయ్యమంటున్నాడు అండి, శోధన చెయ్యమంటున్నాడు. దేన్నీ శోధన చెయ్యమంటున్నాడు? మన చిత్తాన్ని శోధన చెయ్యమంటున్నాడు. చిత్తాన్ని శోధన చెయ్యగా చెయ్యగా, చిత్తాన్ని శోధించగా, శోధించగా శుద్ధి కలుగుతుంది. అంటే శోధన వల్ల శుద్ధి వస్తుంది, శుద్ధి వల్ల ముక్తి వస్తుంది. నిర్వికల్ప సమాధి అంటే ఏమిటి? నిర్వికల్ప సమాధిలో ఉన్నంత సేపు శాంతిగా ఉంటుంది. ఆ సమాధిలో నుంచి బయటకి వచ్చాక మాములుగా చూడటం, అంతా మామూలే. ఆ సమాధిలో నుండి బయటకి వచ్చేశాక మామూలు ప్రకృతిలో పడిపోతాడు. ఎందుచేత? లోపల అజ్ఞానం కారణం. నిర్వికల్ప సమాధిలో మనసు అణిగి ఉంటుంది. రమణస్వామి ఇల్లు విడిచి పెట్టి వెళ్ళిపోయాడు, మనం ఎవరం ఇల్లు విడిచి పెట్టి వెళ్ళిపోవక్కర్లేదు. అది ఆయన దేహ ప్రారబ్ధం. ఒక్కటి మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు ఇంటి కాడ ఉన్నా, ఆశ్రమంలో ఉన్నా, మీ గ్రామంలో ఉన్నా, పుణ్య క్షేత్రంలో ఉన్నా లోపల మీ పురుష ప్రయత్నం చేస్తూ ఉండండి. లోపల మీరు సాధన చేస్తూ ఉంటే, ఆ మనసులో గనుక ప్రయత్నం చేస్తూ ఉంటే మంచిది. మీరు ఋషికేశ్ వెళ్ళినప్పటికీ, కాశీ వెళ్ళినప్పటికీ, లోపల ప్రయత్నం లేకపోతే వాసనలు రాలవు, రాలవు. అంటే నీ దేహం ఎక్కడ ఉన్నది అనేది ప్రధానం కాదు. నీ మనసు ఎక్కడ ఉంది? మీరు ఏ తిండి తిన్నా అది ప్రధానం కాదు. ఏమి కట్టుకుంటున్నారు అనేది ప్రధానం కాదు. మీరు ఏమి ఆలోచిస్తున్నారు అనేది ప్రధానం.

తపస్సు అంటే ఆలోచన. ఏమని ఆలోచిస్తావు? ఆత్మ గురించి ఆలోచించు. నీ మనస్సులో ఆత్మని స్మరిస్తూ ఉంటే ఆత్మ నిన్ను అనుగ్రహిస్తుంది. తన ఒడిలోకి ఆత్మ నిన్ను లాగేసుకుంటుంది. మిమ్మల్ని తీసుకెళ్ళి జ్ఞానం ఇస్తుంది. ఎప్పుడో కాదు, ఇప్పుడే. ఆత్మానుగ్రహం కలిగిన క్షణంలోనే, ఈశ్వర ప్రసన్నత కలిగిన క్షణంలోనే జ్ఞానం కలుగుతుంది. ఒక్కటి జ్ఞాపకం పెట్టుకోండి, మీకు ఎవరికి అయినా దుఃఖం వస్తోంది అనుకోండి. శరీరం దుఃఖ పడుతుందా? ఎవరికి దుఃఖం? అహంకారానికి దుఃఖం. మీకు ఏమైనా సంతోషం వస్తుంది అనుకోండి. ఎవరికి సంతోషం? అహంకారానికి. మీరు మంచి పనులు పుణ్యం కోసం చెయ్యకండి. మంచిని మంచి కోసం చెయ్యండి. ఈశ్వర అనుగ్రహం మీ మీద వర్షిస్తుంది. ఈశ్వరుడు మీకు జ్ఞానాన్ని ఇస్తాడు. మనకు ఎవడు జ్ఞానం ఇచ్చేవాడు? ఈశ్వరుడు. ఆయనకి సంతోషం కలిగితే చాలు. మనకు జ్ఞానం వచ్చేస్తుంది. మీరు ఏకాంతంగా ఉన్నప్పుడు ఎక్కడెక్కడ గొడవలో, సంసారం గొడవలు లెక్కేసుకుంటూ

ఉంటారు. మీరు ఇంటికాడకూర్చున్నప్పుడు లెక్కలు వేసుకుంటూ ఉంటారు. ఎందుచేత? మీకు అకౌంటు కావాలి. మీ అకౌంటు మీరు రాసుకోండి, కాని మనం ఈ అకౌంట్‌తో పాటు ఇంకో అకౌంటు తయారు చేసుకోవాలి. ఆ అకౌంటు ఏమిటి అంటే, మీరు కేవలం భారతం చదివేశాము, రామాయణం చదివేశాము, అలా కాదు. చదివితే చదవండి మంచిదే. మీరు ఏకాంతంగా కూర్చొని, మీ మనసుని భగవంతుడి మీద నిలపండి. మనలో ఏమి బలహీనతలు ఉన్నాయి? ఏ బలహీనత వల్ల, ఏ లోపం వల్ల మన మనస్సు బహిర్ముఖం అవుతోంది? అది చూసుకోండి. మన మనస్సులో ఏమి లోపం లేదు అనుకోండి. నాకేమి weakness లేదు అనుకోండి, మనస్సు బహిర్ముఖం అవ్వదు. నా కళ్లల్లో ఏమి దోషం లేదు అనుకోండి కళ్ళు ఎందుకు మండుతాయి? కళ్లల్లో దోషం ఉంది కాబట్టే కళ్ళు మండుతున్నాయి. కడుపు నొప్పి వస్తుంది అంటే కడుపులో ఏదో దోషం ఉంది అన్నమాట. అదే విధంగా నా మనస్సు బహిర్ముఖం అవుతుంటే ఏ కోరిక వల్ల, ఏ కారణం వల్ల, ఏ వాసన వల్ల, ఏ తలంపు వల్ల నా మనస్సు బహిర్ముఖం అవుతోంది అని చూసుకోవాలి. మీరు పూజలు, జపాలు చేసుకోందురు గాని, కొబ్బరికాయలు అవి కొడుదురు గాని, కంగారు పడకండి. ముందు మీరు విషయం అర్థం చేసుకోండి. మీరు నాకు చేసే ఉపకారం ఏమిటి అంటే విషయం సాధ్యమైనంత వరకు మీరు అర్థం చేసుకోటానికి ప్రయత్నం చెయ్యండి. అది మీరు నాకు చేసే ఉపకారం. ఈ మాత్రం ఉపకారం మీరు నాకు చెయ్యలేరా? నేను ఏమైనా కొబ్బరికాయలు కొట్టమంటున్నానా? చిన్న ఉపకారం కూడా చెయ్యలేరా? ఉపకారం ఏమిటి అంటే నా మాటలు మీరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. మీ చందాలు, బంధాలు నాకు వద్దు. ఈ మాటలు కొంచెం అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి.

నా మనస్సు బహిర్ముఖం ఎందుకు అవుతోంది? ఏ లోపం ఉండటం వల్ల బహిర్ముఖం అవుతోంది అని ఆ లోపాన్ని మీరు అర్థం చేసుకొని ఆ లోపాన్ని ఎప్పుడైతే మీరు

**గురువు కృప నీ మాటలకు, నీ ఆలోచనలకు, నీ ఊహలకు అందదు. అది నీ మనస్సుకి నీ తెలివికి అతీతమైనది. గురువు యొక్క కృప మాటలతో ఎలా చెప్పగలము!**



తొలగించుకుంటారో అదే మీ చివరి జన్మ. ఆ చివరి జన్మలో మీకు మోక్షం లభిస్తుంది. జపాలు చెయ్యండి, ధ్యానాలు చెయ్యండి. కొబ్బరికాయలు కొట్టండి. మంచిదే కానీ ఏ కారణం వల్ల మనస్సు బహిర్ముఖం అవుతోంది? ఈ లోపాలను తొలగించుకోవటానికి ఏ ప్రక్రియను అవలంభించాలి అనేది చూసుకోండి. మీలో ఉన్న లోపాలు ఎవరికి ఏ లోపం ఉన్నప్పటికీ ఒక కామన్ మందు ఒకటి చెబుతున్నాను. ఒక మార్గం చెబుతున్నాను. సత్పురుష సహవాసం. సత్పురుషుల తోటి మీరు ఎక్కువగా సహవాసం చేస్తే మీ లోపాలు కాలిపోతాయి. అందుచేత సత్పురుషుల సహవాసం విడిచి పెట్టకండి. ఒకసారి భగవాన్ అన్నారు ఈ అరుణాచలం ఒక రాళ్ల గుట్ట అనుకోకండి. ఈ గుహలలో చాలా గొప్ప సాధువులు, యోగులు నివసిస్తూ ఉంటారు. మీలో అవకాశం ఉన్నవారు ఎవరైనా అరుణాచలం వెళ్లి చూసిరండి. ఇంతకుముందు చూసినవారు సరే సరి. ఇంతకు ముందు చూడని వారు ఎవరైనా ఉంటే ఒకసారి అవకాశం ఉంటే అరుణాచలం వెళ్లి చూడండి. నిజమైన అరుణాచలం మన ఆత్మే. ఎవరో ఒక లాయరు గారు భగవాన్ ని అడిగారు. ఆ కొండ దేవుడు అంటున్నారు. ఆ కొండ దేవుడా? భగవాన్ దానికి సమాధానం చెప్పలేదు. మళ్లీ ఎదురు ప్రశ్న వేశారు. ఈ దేహం నువ్వు అంటున్నావు. ఈ దేహం నువ్వా? ఇది మీరు బాగా అర్థం చేసుకోండి. సబ్జెక్టు విడిచి పెట్టటం లేదు. లోకానికి విరుద్ధంగా చెప్పటం లేదు. నువ్వు ఏమి అనుకుంటున్నావు? దేహాన్ని నేను అని అనుకుంటున్నావు కదా? ఈ శవాన్ని నువ్వు అనుకున్నప్పుడు, ఈ శవం తోటి నువ్వు తాదాప్యం పొందినప్పుడు శివుడు ఆ కొండ తోటి తాదాప్యం పొందితే నేరమా? నువ్వు ఇలా అనుకుంటున్నావు కాబట్టి ఆయన అలా అనుకుంటున్నారు. కాని తత్త్వంలోకి వచ్చేటప్పటికీ ఇది ఎంత అబద్ధమో అది అంతే అబద్ధం. ఈ దేహం నేను అని నువ్వు ఎలా అనుకుంటున్నావో ఆ కొండని నేను అని శివుడు అనుకుంటున్నాడు. ఈ మధ్య ఎవరో ప్రశ్న అడిగారు. ఏమండి కృష్ణుడు చాలా యుద్ధాలు చేశాడు, చాలా గొడవలు చేశాడు వాడు జ్ఞాని ఎలా అవుతాడు అని? బాహ్యానికి మనకు అలా అనిపిస్తుంది, ఏ వేదవ్యాసుడు అయితే కృష్ణుడు యుద్ధాలు చేశాడు, రాజకీయాలు నడిపాడు అని రాశాడో, ఆ వేదవ్యాసుడే కృష్ణుడు సాక్షాత్తు భగవంతుడే, ఆయన జ్ఞాని అని రాశాడు. యుద్ధాలు చేశాడు అని రాసినవాడే కదా జ్ఞాని అని చెప్పినవాడు. అంటే బాహ్యంగా మనం కొలవటం కష్టం. మనం ఎవరిని కొలచినా మన మనస్సుతోటి కొలుస్తాము. ఈ మనస్సుతోటి చూస్తేనే మనకు లోకం ఇంత భిన్నంగా కనిపిస్తుంది. భేదబుద్ధి కనిపిస్తుంది. మనసుని ఆర్పేయండి. ఆత్మ ఒక్కటే కనపడుతుంది. నేను నా మనసు తోటి చూస్తే లోకం

అంతా భిన్నంగా కనిపిస్తుంది. నన్ను నేను చూసుకుని లోకాన్ని చూస్తే లోకం అంతా నేనే కనిపిస్తాను. రంగన్ ఏమి అంటున్నాడు అంటే కాకులు, కుక్కలు, కోతులు, ఉడతలు, గొర్రెలు అన్నీ నోరు లేని జంతువులు వచ్చి భగవాన్ గొప్పతనాన్ని గుర్తించి దర్శనం చేసుకుని వెళు తున్నాయి. కాని తన తెలివిని ఉపయోగించే మానవుడు గుర్తించలేకుండా ఉన్నాడు. భగవాన్ ఎవరో అనుకుంటున్నాడు, సత్యాన్ని గుర్తించలేక పోతున్నాడు. జ్ఞాని దగ్గరగా ఉన్నా మనలో అసూయ ఉంటే గుర్తించలేము.

ఓ అర్జునా! నీకు ఈ గీతా శాస్త్రాన్ని చెబుతున్నాను. ఎందుకు చెబుతున్నానో తెలుసా? నువ్వు అనసూయుడవు. అసూయ అనే గుణం నీలో లేదు. అందుకే నీకు చెబుతున్నాను అన్నాడు భగవంతుడు వాసుదేవుడు. ఒక చిన్న రహస్యం చెబుతున్నాను మీరు జాగ్రత్తగా అట్టే పెట్టుకోండి. గీత గాని, రామాయణం గాని మీరు చదివితే అర్థం కాదు. మీకు దానిమీద గౌరవ భావం ఉండాలి. మీకు గౌరవ భావం లేదు అనుకోండి ఆ పుస్తకం మీద, మీరు కోటి సార్లు చదివినా మీకు అర్థం అవ్వదు. ఈ జన్మ పొడవునా పారాయణ చేసినా అర్థం కాదు. ముందు మీకు గౌరవం ఉండాలి. మీరు చదివే రామాయణం మీద, మీరు చదివే భాగవతం మీద, మీరు చదివే భారతాలు మీద ముందు మీ హృదయంలో గౌరవం ఉండాలి. మీ హృదయంలో గౌరవం ఉంటే మీకు భాషా జ్ఞానం తక్కువ ఉన్నప్పటికీ అవి మీ హృదయానికి వచ్చి తాకుతాయి. అది మీకు అర్థం అవుతుంది. గ్రంథపు తలుపులు తెరవబడతాయి. ఎందుకు? మిమ్మల్ని లోపలకి తీసుకు వెళ్ళటానికి. ఏదైనా ఒక ఇంట్లోకి వెళ్లాలని ఉంది అనుకోండి తలుపులు వేసేసి ఉన్నాయి అనుకోండి. లోపలకు వెళ్లగలమా మనం? వెళ్ళలేము. అందుచేత ఏ గ్రంథమైన చదివేటప్పుడు మీకు గౌరవం ఉంటేనే ఆ గ్రంథం దాని తలుపులు తెరుస్తుంది. అప్పుడు మీరు లోపలకి వెళ్ళచ్చు. అసలు మీకు గౌరవం లేనప్పుడు ఆ గ్రంథం మీకు ఎలా అర్థం అవుతుంది? ఎవరైనా పండితుడుతో చెప్పించుకున్నా మీకు అర్థం అవ్వదు గౌరవం లేనప్పుడు. ఆ గ్రంథం పట్ల గౌరవం, ఆ పూజ్య భావం, మీ హృదయంలో ఉండాలి. అది మీరు కొనుక్కుంటే రాదు. సత్పురుషుల సహవాసం ఉంటే వస్తుంది. మీరు భగవద్గీత చదవలేరు అనుకోండి. భగవద్గీత పుస్తకం కొనుక్కుని రోజు ఒక నమస్కారం పెట్టుకోండి చాలు. మీకు ఆ భగవద్గీత గొప్పతనం, చదవకపోయినా కూడా మీ హృదయానికి తాకుతుంది. ఈ మాటలు ముందు మననం చేయండి, విడిచి పెట్టేయకండి. ఈ మాటలని వూసేయకండి. మననం చేయండి. శాస్త్రం పట్ల, గురువు పట్ల, ఈశ్వరుడు పట్ల గౌరవం పెంచుకోండి. మీరు గౌరవించటం వలన ఈశ్వరుడికి

వచ్చే లాభం లేదు, మీరే లాభాన్ని పొందుతారు. అన్ని నోరు లేని జంతువులు వచ్చి భగవాన్ గొప్పతనాన్ని గుర్తించి దర్శనం చేసుకొని వెళ్ళిపోతున్నాయి. కాని తన తెలివిని ఉపయోగించే మానవుడు ఒక్కడే గుర్తించలేకుండా ఉన్నాడు. భగవాన్ ఎవరో అనుకుంటున్నారు. మనుషులకి భగవాన్ ఎవరో తెలియటం లేదు. ఎందుచేత అంటే మనం మనస్సు తోటి కొలుస్తాము. ఒక జ్ఞానిని అర్థం చేసుకోవటానికి ఇంకొక జ్ఞాని ఉండాలి. ఎందుచేత అంటే ఎంతటి వాడిని అయినా మన మనస్సుతోటే కొలుస్తాము. అందుచేత అర్థం కాదు.

ఈ ప్రవచనం విన్నాక కూడా మీ మనసులో రవ్వంత కూడా మార్పు రాదు అనుకోండి దోషం మీది కాదు నాది దోషం. మీ హృదయానికి గుచ్చుకునేలా నేను చెప్పలేకపోయాను. మీకు అర్థం కాకపోయినా తప్పు నాదే. ఏది శాస్త్రం అంటే తల్లి తన బిడ్డని ఎలా చూసుకుంటుందో, తండ్రి ఏ విధంగా అయితే మంచి మాటలు చెబుతాడో, భర్త ఏదైనా దుఃఖం తోటి బాధ పడుతుంటే భర్త యొక్క దుఃఖాన్ని పోగొట్టడం కోసం భార్య ఏ విధంగా అయితే కృషి చేస్తుందో, ఈ మూడు పనులను ఏ పుస్తకం చేస్తుందో అదే శాస్త్రం అని ఆచార్యుల వారు చెప్పారు. భార్య చేసేపని గ్రంథం చెయ్యాలి, తండ్రి చేసేపని గ్రంథం చెయ్యాలి, తల్లి చేసేపని గ్రంథం చెయ్యాలి. ఇవి మూడు పనులు కలిపి ఏ శాస్త్రం అయితే చెయ్యగలదో, అదే శాస్త్రం అన్నారు ఆచార్యుల వారు. అటువంటి పుస్తకం మీకు ఎక్కడైనా దొరికితే ఎన్ని వేలు పెట్టి అయినా కొనండి. ఎందుచేత అంటే అది మీకు తల్లి చేసిన పని చేస్తుంది. తండ్రి చేసిన పని చేస్తుంది. భార్య చేసిన పని చేస్తుంది. వేదాలే ఆత్మను గురించి వర్ణించలేక వెనక్కి వచ్చేశాయి. వెళ్ళినంత దూరం ప్రయాణం చేశాయి. వేదాలు కూడా చెప్పలేక వెనక్కి వచ్చేశాయి. సృష్టి ప్రారంభం అయిన తరువాత ఎంగిలి కాని వస్తువు ఏదైనా ఉంది అంటే అది మన హృదయంలోని ఆత్మే. మీకు అందరికి జ్ఞానం కలుగుతుంది. సందేహ పడకండి. జ్ఞానం వస్తుందా? రాదా? అని ఏమి అనుమానం పెట్టుకోకండి. మీకు అందరికి జ్ఞానం కలుగుతుంది.

కృష్ణుడు ఏమి చెప్పాడు అంటే గురువును సమీపించు, గురువుని సంతోషపెట్టు. గురువు నిర్మలంగా ఉన్నప్పుడు, ప్రశాంతంగా ఉన్నప్పుడు, టైం కనిపెట్టి ప్రశ్నలు అడగమన్నాడు. గురువు యొక్క అనుగ్రహం ఈశ్వర అనుగ్రహంతో సమానం. గురువు అంటే ఆత్మ. మనకున్నది దేహబుద్ధి. ఈ దేహబుద్ధి నుంచి ఆత్మబుద్ధిలోకి గురువు యొక్క ఒక్క చూపు వల్ల మార్పు కలుగుతుంది. శిష్యుడు పక్కానికి వస్తే జ్ఞాని యొక్క ఒక్క చూపు చాలు. ఒక జ్ఞాని మనతోటి మాట్లాడాడు అంటే దయ తప్పించి ఇంకొకకారణం కనపడదు. ఇంకో కారణం కనుక ఉంటే

వాడు జ్ఞాని కాదు.  కేవలం మనం దేహ బంధుత్వాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేస్తాం, అది మంచిది కాదు.  శాస్త్రవాసన పోవచ్చు, లోకవాసన పోవచ్చు, దేహవాసన పోవటం సామాన్య విషయం కాదు.  దేహవాసన పీడించేస్తుంది మనిషిని.  దేహవాసన పోకుండా మనసు నిర్మలం కాదు.  ఎదుటివాడు ఏ ఉద్దేశం తోటి మాట్లాడుతున్నాడో మనకు తెలియాలి.  ఆ మాట కాదు మనకి కావలసింది.  ఏ ప్రేరణ వల్ల ఆ మాట వస్తుంది తెలుసుకోవాలి.  ధ్యానం చాలా గొప్పది అని చెబుతారు మనవాళ్లు.  నిజంగా గొప్పదే కాని అది కూడా ద్వైతమే.  తలంపు లేకపోతే మాట లేదు, తలంపు లేకపోతే పని లేదు, తలంపు లేకపోతే ధ్యానం లేదు.  వాడిలో ఆ దోషం ఉంది, వీడిలో ఈ దోషం ఉంది అని భగవాన్‌తో ఎవరైనా చెబితే, భగవాన్ అనేవారు అట.  వాడు జ్ఞానం పొందటం కోసం నీ certificate వాడికి అక్కర్లేదు.  వాడిలో లోపాలు ఉంటే వాడు చూసుకుంటాడు.  మీ లోపాలు ఏమిటో మీరు చూసుకోండి.  ముందు నీ లోపాలు ఏమిటో నువ్వు చూసుకో.  నీ లోపాలను సరిచేసుకో.  నీ లోపాలను నువ్వు సరిచేసుకోవటం మానేసి, వాడి లోపాలను వెతకటం ఎందుకు?  ఈ రూపాలు ఊరికే నీడలు.  నీడకి అస్థిత్వం ఏముంది?  నీడకి అస్థిత్వం లేదు.  మన మనసుకు ఎంతసేపు రూప దృష్టి, నామ దృష్టి, అందుకే మనకు జ్ఞానం కలగటం లేదు.  అందుకే పూర్వం మన పెద్దలు ఈశ్వరుడి రూపం, కృష్ణుడి రూపం, రాముడి రూపం దేవాలయాల్లో పెట్టారు.  ఎందుచేత అంటే ఆ రూపం పట్టుకుంటే ఈ రూపాలు పోతాయి.  మీరు రాముడి రూపాన్నో, కృష్ణుడి రూపాన్నో, ధ్యానం చేయగా, చేయగా ఈ ప్రాణ ప్రయాణ కాలంలో ఆ రూపం కూడా పోతుంది.  మీరు ఏ రూపం కోసం అయితే మీ జీవితాన్ని ఖర్చు పెట్టారో ఏ రూపాన్ని అయితే మీరు నిరంతరం ధ్యానం చేశారో, స్మరించారో, జపించారో, ఏదైతే నిజమో ఆ రూపానికి తెలుసు.  ఆ నిజాన్ని మీకు చూపించి ఈ రూపం కూడా పోతుంది.

ఒకసారి రమణస్వామిని రాముడు జ్ఞానా?  కృష్ణుడు జ్ఞానా?  శివుడు జ్ఞానా? అని



**గురువు వేరు ఈశ్వరుడు వేరు అనుకోకు. ఎవడైతే ఈశ్వరుడు అనుకొంటున్నావో, ఎవడైతే చైతన్యం అనుకొంటున్నావో వాడే గురురూపం ధరించి నీ ముందుకు వస్తాడు.**

అడిగారు అప్పుడు రమణస్వామి ఏమని చెప్పారు అంటే ఎవరిని స్మరిస్తే మనకు జ్ఞానం కలుగుతోందో, వాళ్ళు జ్ఞానం లేకుండా ఉన్నారా? కోతి ఉరికినట్టు మన మనసు ఏమి చేస్తుంది అంటే ఒక కోరిక నుంచి ఇంకొక కోరిక మీదకి ఉరుకుతూ ఉంటుంది. ఒక తలంపుని విడిచి పెట్టి ఇంకొక తలంపు దగ్గరకి వెళ్ళేటప్పుడు మధ్యన కొంత ఖాళీ ఉంటుంది. ఆ ఖాళీని కొంచెం పొడిగించండి. ఖాళీ పొడిగిస్తే మీకు జ్ఞానం వస్తుంది. శంకరాచార్యుల వారు ఏమన్నారు అంటే మన మనసు కూడా ఒక కోరిక మీద నుంచి ఇంకొక కోరిక మీదకి ఉరుకుతుంది కాబట్టి ఇది కూడా కోతే అన్నారు. ఆచార్యుల వారు ఏమన్నారు అంటే ఓ శంకరా నువ్వు నాకు ఏమి ఇవ్వవద్దు. నేను ఈ కోతితో పడలేకపోతున్నాను. ఏ కోతి? మనస్సు అనే కోతి. నువ్వు నాకు ఏమి ఇవ్వక్కర్లేదు. ఈ కోతిని పుచ్చుకో. ఈ కోతిని పుచ్చేసుకుంటే నీకు లాభం ఏమిటి అంటే ఎక్కడికైనా భిక్షకి వెళ్ళినప్పుడు ఈ కోతిని కూడా తీసుకెళ్ళు. మనం కోతిని చూస్తూ కాసిని బియ్యం ఎక్కువ వేస్తాం. అందుచేత నీకు లాభం, నాకు లాభం. నాకా ఈ మనస్సు తంటా, ఈ మనస్సుధరిద్రం వదిలిపోతుంది. నీకు లాభం ఏమిటి? నువ్వు ఎలాగో బిచ్చగాడివే కదా. అందుచేత నీకు బియ్యం ఎక్కువ పడతాయి. నీకు లాభం, నాకు లాభం. అలా ఉండాలి ఎప్పుడు బేరం అంటే!

మీకు ఇష్టం లేకపోతే నేను చెప్పిన మాటలు మర్చిపోండి ఇప్పుడే. కానీ ఈ ఒక్క వాక్యం జ్ఞాపకం ఉంచుకోండి. మనం అందరం ఒకే జాతికి చెందిన వాళ్లం. ఒకే తప్పు చేస్తున్నాము. మన కోరిక ప్రకారం, మన సంకల్పం ప్రకారం భగవంతుడు నడుచుకోవాలి అని ఆశ. ఇలా ఎంతకాలం అయితే అనుకుంటామో, కోటి జన్మలు ఎత్తినా మనకు జ్ఞానం రాదు. కోటి జన్మలు ఎత్తి మీరు కోటి క్రతువులు చేసినా జ్ఞానం రాదు. మన తలంపుకి అనుకూలంగా, మన కోరికకు అనుకూలంగా, మన సంకల్పానికి అనుకూలంగా ఈశ్వరుడిని మలచుకుంటున్నాము అందుకే జ్ఞానం రాదు. మరి ఎవరికి జ్ఞానం వస్తుంది? ఈశ్వర సంకల్పానుసారం మనం నడచుకుంటే జ్ఞానం వస్తుంది. అంటే ఈశ్వర సంకల్పానుసారం మనం నడచుకోవాలి అని అనుకోవటం లేదు. మన సంకల్పం ప్రకారం ఈశ్వరుడు నడవాలి అనుకొంటున్నాము. ఇది మనం అందరం చేసే తప్పు. ఈశ్వర సంకల్పాన్ని మనం గౌరవించటం లేదు. మన సంకల్పాన్ని ఈశ్వరుడు గౌరవించాలి అని మనం కోరుకుంటున్నాం. నీ సంకల్పమే నెరవేరు గాక, అని ఈశ్వర సంకల్పాన్ని నెరవేర్చటం కోసమే గనక మనం పని చేస్తుంటే మనకి జ్ఞానం వద్దు అనుకున్నా వచ్చి జ్ఞానం వరిస్తుంది. ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. ఇంకొక్క మాటచెబుతాను, మీరు ఎవరి భక్తులో, ఏ కులస్థులో, ఏ మతస్థులో

నాకు అక్కర్లేదు. సంకల్పాన్ని త్యాగం చెయ్యకుండా ఎవడు యోగి కాలేడు, జ్ఞాని కాలేడు. మీరు ఎన్ని సాధనలు చేసినా సంకల్పాన్ని త్యాగం చెయ్యలేకపోతే మీకు యోగం సిద్ధించదు, పొందవలసిన దానిని పొందలేరు. ఒక భక్తుడు భగవాన్ ఎదురుగానే అంటున్నాడు ఇంకొక భక్తుడు తోటి. నువ్వు భగవాన్ దర్శనం తరచుగా చేసుకుంటున్నావు, కొంప ముంచుతాడు. నువ్వు జాగ్రత్తగా ఆలోచించుకోవాలి. ఎందుకు ఇన్నిసార్లు దర్శనం చేస్తావు. నీ కొంప గుల్ల అయిపోతుంది. తరచుగా ఆయన మాటలు వింటూ ఉంటే, ఆయనను చూస్తూ ఉంటే నువ్వు సన్యాసివి అయిపోతావు. అందుచేత తరచుగా చూడకు అని ఒక భక్తుడు ఇంకొక భక్తుడితో చెబుతున్నాడు. అయ్య బాబోయ్ నువ్వు అలా అనకు. నువ్వు అటువంటి మాటలు అనకు. నేను నెలకి వెయ్యి రూపాయలు తెచ్చుకుంటున్నాను. నన్ను సన్యాసిని చేసేస్తాడు అంటున్నావు నువ్వు, అలా అనకు. నాకు భార్య ఉంది, పిల్లలు ఉన్నారు. నెలకి వెయ్యి రూపాయలు తెస్తాను అని ఆ భక్తుడు అంటున్నాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే అందరికి అన్నీ పోవు. భగవాన్ ఎంత తెలివి తేటలుగా చెబుతున్నారో చూడండి. ఎవరు ఏది కోరుకుంటే అది వస్తుంది. నాకు సంసారం పెరగాలి, నాకు డబ్బులు పెరగాలి, నాకు గౌరవాలు పెరగాలి అంటే గౌరవాలు పెరుగుతాయి. నాకు ఏమి వద్దు స్వామి. నాకు లోక సంబంధం లేదు స్వామి. లోక సంబంధం తోటి విసిగిపోయాను. లోకాన్ని విడిచి పెట్టేశాను నాకు జ్ఞానాన్ని ప్రసాదించు. అని జ్ఞానాన్ని కోరుకుంటే జ్ఞానం వస్తుంది. ఎవరు ఏది కోరుకుంటే అదే వస్తుంది అన్నారు భగవాన్.


నీకు ఇంటికాడ డబ్బులు లేవు, ఎందుకు అలా ఇబ్బంది పడతావు అమ్మను డబ్బులు అడగరాదా అని రామకృష్ణుడు వివేకానంద తోటి అన్నాడు. నాకు ఇంటికాడ ఇబ్బందిగా ఉంది. అన్నానికి కూడా బాధ పడుతున్నాను. నీ బిడ్డ ఇక్కడ బాధ పడుతుంది అమ్మా కరుణించు అనిప్రార్థించమన్నాడు రామకృష్ణుడు వివేకానంద తోటి. వివేకానంద గురువు గారు చెప్పిన మాటలు అన్నీ విన్నాడు. కాళీమాత దగ్గరకు వెళ్ళాడు, నమస్కరించాడు, అమ్మా నాకు జ్ఞానాన్ని ప్రసాదించు, వైరాగ్యాన్ని ప్రసాదించు అని అడుగుతున్నాడు. అంటే నేర్చుకున్నది అంతా పోయింది. తన హృదయంలో studyగా ఉన్నది, ఆ లోతులో ఉన్నది ఉబికి ఉబికి పైకి వచ్చింది. గురువుగారు చెప్పినవి అన్నీ ఒక్కసారి మర్చిపోయి నాకు జ్ఞానాన్ని ప్రసాదించు, వైరాగ్యాన్ని ప్రసాదించు. ఎందుచేత? ఆ హృదయంలో ఉన్నది బయటకి వచ్చేసింది.

ఇంకొక రహస్యం చెబుతాను. మనకి అందరికి డాక్టరులు వైద్యం చేయనిశరీరం

ఒకటి ఉంది. అది surgeonకి అందదు, physicianకి అందదు. మనం ధ్యానంలో కూర్చొంటున్నాం, దేవుడి పటం ఎదురుగా పెట్టుకుంటున్నాం. కానీ మనసు బయటకి వెళ్లిపోతోంది. మనం హరేరామ హరేకృష్ణ అంటూ ఉంటాం మనసు బయటకి వెళ్లిపోతూ ఉంటుంది. నేను దేవుడు పటం ఎదురుగానే ఉంటుంది. కళ్ళు చూస్తూ ఉంటాయి, మనస్సు బయటకి వెళ్లిపోతూ ఉంటుంది. ఇది నిజమా అబద్ధమా? అంటే మనలో మనమాట బయట అనవద్దు ఈ గొడవ. బయట మనం అందరం భక్తులగానే చలామణి అవుదాం. పొద్దున్న రెండు గంటలు పూజ, సాయంత్రం రెండు గంటలు పూజ మనసు బయటకు పోతే పోతుంది అనుకోండి, కూర్చుంటున్నాం కదా, సమాజంలో భక్తుల కింద చలామణి అయ్యిపోతున్నాం కదా. ఈ గౌరవాలు మళ్ళీ పోగొట్టుకోవటం ఎందుకండీ. కళ్ళు వెంకటేశ్వర స్వామిని చూస్తూ ఉంటాయి. మనసు బయటకిపోతూ ఉంటుంది. దీనికి ఒక్కటే కారణం. వైరాగ్యం లేదు. ఈ ఒక్క మాట మీరు జ్ఞాపకం ఉంచుకోండి, మీకుఎంతకాలం అయితే వైరాగ్యం కలగదో అంతకాలం మీ మనసుని మీరు ఆపు చేయలేరు. ఎంతకాలం అయితే మీకు వైరాగ్యం కలగదో, ఎన్ని పూజలు చేసినా, ఎన్ని జపాలు చేసినా, చెయ్యండి నేను వద్దు అనటం లేదు. ఎన్ని పూజలు చేసినా, ఎన్ని జపాలు చేసినా మీ మనస్సు బహిర్ముఖం అవ్వటం మానదు. ఎవరైనా రమణస్వామి దగ్గరకి వచ్చి మా మనస్సు ఆగటం లేదండి. మా మనస్సు కదిలిపోతోంది అంటే భగవాన్ అనేవారు అంట నా మనస్సుని కదలమంటే కదలటం లేదు. మీ మనస్సును ఆగమంటే ఆగటం లేదు. కారణం ఏమిటి? ఆయనకి వైరాగ్యం ఉంది, మనకి వైరాగ్యం లేదు. ఈ దేవుడి పటాలు మీ మనస్సుని ఆపు చేయలేవు. పటాలు పెట్టుకోండి మంచిదే నేను వద్దు అనటం లేదు. మీకు ఎంతకాలం అయితే వైరాగ్యం లేదో అంతకాలం మీ మనస్సు బహిర్ముఖం అవుతూనే ఉంటుంది. ఎప్పుడైతే మీరు వైరాగ్యం అనే సంపదని సంపాదించుకున్నారో అప్పుడు మనస్సు నిదానంగా ఉంటుంది. నిలకడగా ఉంటుంది. గాలి లేని చోట దీపం ఎలా ఉంటుందో, అలా నిశ్చలంగా ఉంటుంది. ఎవరి మనస్సు? వైరాగ్యం ఉన్నవాడి మనస్సు. మీరు రూపాయలని సంపాదించుకుంటున్నారు, అధికారాలను సంపాదించుకుంటున్నారు, గౌరవాలు సంపాదించుకుంటున్నారు, అన్నీ సంపాదించుకుంటున్నారు కానీ మనకు లేనిది ఒక్కటే, ఏమిటది? వైరాగ్యం. చాలా సంపాదించుకున్నాం. అలా సంపాదించుకున్నది మనసుని ఎందుకు ఆపు చేయటం లేదు? ఈ వైరాగ్యం అనే సంపద ఉన్నవాడికే మనసు నిలకడగా ఉంటుంది. వాడి మనసు అంతర్ముఖం అవుతుంది. మనస్సుకు అంతర దృష్టి ఎప్పుడైతే కలిగిందో చేతిలో ఉన్న ముద్ద

నోటిలో వేసుకోవటం ఎంత తేలికో మనస్సు అంతర్ముఖం అయితే మోక్షం కలగటం అంత తేలిక. విషయాన్ని అర్థం చేసుకోండి. విషయాన్ని అర్థం చేసుకుంటే మీరు చేసే ప్రయత్నం తేలికగా ఉంటుంది. ఎన్ని బలహీనతలు ఉన్నాయో మీ మనసులో ఆలోచించుకోండి. ఏదో ఒక లోపం కనిపిస్తుంది. ఆ లోపాన్ని పరిష్కరించు కోవడానికి ప్రయత్నం చేయండి. మీరు చేస్తున్న ప్రయత్నమే సాధన. సాధన అంటే కంగారు పడకండి. వేదాంత పుస్తకాలలో వేదాంత పరిభాషలో ఆ మాటలు విని మీరు ఏమి కంగారు పడకండి. సాధన సాధన అంటే మీరు కర్ర సాధన అనుకోకండి. ఆ మాటలు చూసి మీరు గాబరా పడకండి. మీ లోపల ఏముందో చక్కగా అర్థం చేసుకోండి. మీరు పైకి చెప్పక్కర్లేదు. మీరు ఇంటికాడ ఏకాంతంగా కూర్చుని మీ లోపల ఏముందో మీరు తెలుసుకోండి. మీరు విషయాన్ని అర్థం చేసుకున్నాక ఆ లోపాన్ని తీసేసుకోవటం కోసం ప్రయత్నం చేయండి. అలా ప్రయత్నం చెయ్యటమే సాధన. మనం ప్రయత్నం ప్రారంభించిన తరువాత కొంతకాలానికి కాలం కలిసి వస్తుంది. కాలం ఎప్పుడైతే కలిసి వస్తుందో అప్పుడు ఈశ్వరఅనుగ్రహం మనకి వస్తుంది. అప్పుడు ఆ కోరిక వాసనతో సహా రాలిపోతుంది. ఆ తలంపు వాసనతో సహా రాలిపోతుంది. ఆ సంస్కారం వాసనతో సహా రాలిపోతుంది. ఏ సెకనులో అయితే నిశ్శేషంగా అన్నీ రాలిపోయాయో ఆ సెకనులో మీరు పరమేశ్వరుడి స్వరూపం పొందుతారు. అది పొందకుండా కనుక ఈ దేహం మనం విడిచి పెట్టేస్తే మనం ఎంతో నష్టాన్ని అనుభవిస్తాం. ఎంతో కష్టాన్ని అనుభవిస్తాం.

మనం మోక్షంలోనే ఉన్నాం. అది మన అనుభవంలోకి రావటం కోసం అడ్డు వచ్చే బలహీనతలని మనం తొలగించుకోవాలి, అదే సాధన. నేను మొట్ట మొదట్లోనే చెప్పాను. కొంతమంది చెబుతూ ఉంటారు నేను నాలుగు గంటలు సాధన చేస్తున్నాను. ఐదు గంటలు సాధన చేస్తున్నాను అని. అలా ఎవరికీ చెప్పకండి, మీరు రహస్యంగా ఉంచుకోండి. ఎప్పుడు మాట్లాడినా ఆలోచించి మాట్లాడాలి. ఆలోచన లేకుండా మాట్లాడకండి. ఆ మాటలు



**నీకు ఏమి కావాలో నీకంటే గురువుకి ఎక్కువ తెలుసు.**

**నీ ఆటంకాలు ఏమిటో, నీకేది క్షేమమో నీకంటే**

**గురువుకి ఎక్కువ తెలుసు.**

తిరిగి మీకే వస్తాయి. మీరు మంచి మాటలు మాట్లాడితే మీకు పుణ్యం వస్తుంది. మాట జ్ఞానాన్ని కలుగజేస్తుంది. మనస్సు నిర్మలంగా ఉంచుకోండి. దేనికి మనస్సుని కంగారు పెట్టుకోకండి. భగవంతుడు మనకి అండగా ఉన్నాడు. భగవంతుడు మనకి స్వామి. ఆయన సంకల్పం ప్రకారం మనం జీవించాలి. మనం తప్పనిసరిగా సాధన వల్ల అభివృద్ధిలోకి వస్తాం. భగవంతుడి స్వరూపాన్ని మనం పొందుతాం. నేను మొట్ట మొదట్లోనే చెప్పాను. మీరు అందరు నాకు గురువులు అని. మీరు అందరు నాకు గురువులు కాకపోతే ఇంత ఓర్పుగాఎందుకు వింటారు. నేను ఏ మాటలు మాట్లాడినా, ఎలా మాట్లాడినా ఓర్పుగా విన్నారు. అందుచేత అందరూ నాకు గురువులు.

ఈ లోకంలో ఎంగిలి కానిది అంటూ ఏదైనా ఉంది అంటే ఆత్మ ఒక్కటే. ఈ లోకంలోనే కాదు, పరలోకంలోనే కాదు, ఏ లోకం వెళ్లినప్పటికీ కూడా ఎంగిలి కానిది ఒక్కటే వస్తువు ఆత్మ. దానిని ఎవరు ఎంగిలి చేయలేరు. ఎందుచేత అంటే మన మాటలకి మన నాలుకకి అది అందదు. మన నాలుకకి అందితే కదా మనం ఎంగిలి చెయ్యగలుగుతాము. మన నాలుకకి అందదు. మన మాటలకి అందదు. మన తలంపుల తోటి దానిని ముట్టుకోలేము. అది అనుభవంలోకి వచ్చినప్పుడు మనకి తెలుస్తుంది. ఏమని తెలుస్తుంది? దానిని మనం ఏమి చెయ్యలేము అని. అది మనమే అయినప్పటికీ దానికి ఎంతో దురాన ఉన్నట్టు అనిపిస్తుంది. కేవలం రూపాయలే, కొబ్బరికాయలే ఆస్తి అనుకోకండి. గ్రహణ శక్తి కూడా మనకు ఆస్తే. జ్ఞాపక శక్తి కూడా మనకు ఆస్తే. గురువు యందు ప్రేమ కూడా చాలా అవసరం. ఎందుచేత అంటే గురువు కూడా ఈశ్వరుడి తోటి సమానం. గురువు అంటే నేను మీకు మంత్రం చెబితే నేను గురువు కాను. మీరు నాకు మంత్రం చెప్పినా నాకు గురువు కాదు. గురువు అంటే ఎవరు? కేవలం ఆత్మని దర్శించినవాడే గురువు. సత్యాన్ని ఎవడైతే దర్శించాడో వాడే గురువు. దేవుడికి ఎంతో దూరంగా ఉన్నాం, సత్యానికి ఎంతో దూరంగా ఉన్నాం అనుకుంటున్నాం. సత్యానికి దూరంగా లేవు. దేవుడికిదూరంగా లేవు, మోక్షానికి దూరంగా లేవు. నువ్వే దేవుడు, నువ్వే మోక్షము అని ఎంతో దగ్గరగా నీ చేతికి పట్టి ఇచ్చేవాడే గురువు. మంత్రం చెప్పేవాడు గురువు కాదు. మోక్షాన్ని నీ అరచేతిలో పెట్టేవాడే గురువు. ఆత్మ దూరంగా లేదు. మలిన బుద్ధికి దూరంగా ఉంటుంది. పవిత్ర బుద్ధికి దగ్గరగా ఉంటుంది. మనం జీవితం పొడవునా సంపాదించుకోవాలి, సంపాదించుకోవాలి అనుకుంటూ ఉంటాం. సంపాదన దృష్టి ఎన్నో జన్మల నుంచి మన కూడా వెంటాడుతోంది. అదేవిధంగా ఆత్మ ఎక్కడో ఉంది, ఎక్కడో మనకి దూరాన ఉంది, అది కూడా సంపాదించుకోవాలి అని అనుకుంటాం. ఆత్మ మనమే

అయినప్పుడు సంపాదించుకోవటానికి ఏమి సంపాదిస్తాము? తరతరాల నుంచి యుగయుగాల నుంచి మనం ఏనాడు అయితే ఈ శరీరాలు దాల్చటం ప్రారంభించామో అప్పటి నుంచి కూడా మనకి బాహ్య దృష్టి అలవాటు పడిపోయి సత్యవస్తువు ఎక్కడో దూరాన ఉంది, దాన్ని సంపాదించుకోవాలి అని అలవాటు పడిపోయాం. సంపాదించుకోవాలి అనే దృష్టి ఉన్నంత కాలం మీరు సంపాదించలేరు. ఎందుచేత అంటే అది మనకు వేరుగా లేదు. ఈ ఆలోచనల నుండి బయట పడకపోతే ఏదేవుడు మనకు సహాయం చెయ్యలేడు. ఆత్మను సంపాదించటం ఏమిటి? అది మీరే కదా.

ఆచార్యుల వారి దగ్గర ఒక శిష్యుడు ఉండేవాడు. ఆచార్య స్వామి వారికి ఎంతో చాకిరి చేశాడు. ఆచార్యులవారు ఏమి చెప్పలేదు. అయినా ఎంతో ఆప్యాయంగా ఉండేవాడు, ఆయనకు ఏది కావాలో అది చూసేవాడు. చాలా జాగ్రత్తగా ఆచార్యులవారి తోటి చాలా ప్రేమగా ఉండేవాడు. ఆయన అడగలేదు, ఈయన చెప్పలేదు. ఒకరోజున ఆచార్యులవారు కూర్చొన్నారు గదిలో, అతను వెనకాల వచ్చాడు పని చూసుకుంటున్నాడు, చప్పుడు అవుతుంది. ఎవరు అక్కడ, మనం కూడా అంటాం చూడండి ఇంటికాడ ఏమైనా చప్పుడు అవుతుంటే, ఎవరు అక్కడ చప్పుడు చేస్తున్నారు, అంటే నేను అన్నాడు. ఎవరు అంటే నేను అంటున్నావు. నేను అంటే నీకు అంత ఇష్టమా? నేను అంటే నీకు అంత ప్రీతా? అంత ప్రేమా? ఒకవేళ ఆ నేనుని విడిచి పెట్టలేకపోతే ఆ నేను అంటే నీకు చాలా ఇష్టం అయితే ఆ నేనుని విడిచి పెట్టే శక్తి నీకు లేకపోతే ప్రపంచం అంతా నేను అనుకో. నీకు ఇష్టం కదా అది. ఆ నేనుని విడిచి పెట్టద్దు. నేను నేను అంటున్నావు ఈ ప్రపంచం అంతా కూడా నేను అనుకో. అప్పుడు శిష్యుడు ఏమి మాట్లాడటం లేదు. ఈ ప్రపంచం అంతా నేనే అని అనుకోవటం నీకు ఇష్టం లేదా, మొత్తానికి నేను విడిచి పెట్టేయి. ఇక్కడ రెండు మార్గాలు చెప్పారు ఆచార్యుల వారు. ఈ ప్రపంచం అంతా నేను అనుకో అది కర్మ మార్గం. రెండవది ఏమిటి అంటే మొత్తానికి నేను విడిచి పెట్టు. అది జ్ఞాన మార్గం. ఈ రెండింటిలో ఏదో ఒకటి చెయ్యి నీకు జ్ఞానం కలుగుతుంది. ప్రపంచంలో ఎంతో భేదం కనిపిస్తుంది మనకి. ఈ భేదం అంతా నిజమా అబద్ధమా అంటే ఈ భేదం అంతా అబద్ధమే. ఈ నేను యొక్క కల్పితం. మనం నేను నేను అంటున్నాం కదా. ఈ దేహగతమైన నేను, దేహానికే పరిమితం అయిన నేను. ఈ నేనుని ఎంతకాలం అయితే మనం విడిచి పెట్టలేమో, అంతకాలం ఈ లోకంలో మనకు దేహం కనిపిస్తూనే ఉంటుంది.

నిద్రట్లో మీకు గ్రహించడానికి ఏమైనా ఉందా? అక్కడ గ్రహించడానికి ఏమి లేదు. తెలుసుకోవటానికి ఏమి లేదు. అయినా మనం లేము అని అనగలమా? గాఢ నిద్రలో గ్రహించటానికి ఏమి లేదు. కాని ఏమి లేదు అని చెప్పటానికి అది చూసి కాని చెప్పలేము. అక్కడ చూసేవారు ఎవరు? అదే ఆత్మ. ఆత్మను సాక్షి అని పిలుస్తారు. ఏది లేదు అన్న సంగతి కూడా అది చూస్తుంది. ఈ జాగ్రదావస్థలోకి ఆ నిద్రని మీరు తెచ్చుకోగలిగితే మీకు అందరికి జ్ఞానం కలుగుతుంది అన్నారు రమణస్వామి. నిద్రట్లో ఉన్న స్థితే మనకి జాగ్రదావస్థలో తెచ్చుకోగలిగాము అనుకోండి అప్పుడు మీకు భేదం ఏముంటుంది? అప్పుడు ఎవరి మీద మీకు కోపం వస్తుంది? ఎవరిని చూసి అసహ్యించుకుంటారు. అప్పుడు చావు ఉందా ఎవరికి అయినా? మనకు బాహ్యంగా చావు గురించి ఆలోచన వస్తుంది. కనిపిస్తున్న ఈ దేహమే నిజం గనుక అయ్యుంటే దానిని గోతిలో ఎందుకు కప్పెడుతున్నారు? పుల్లల తోటి ఎందుకు కాలుస్తున్నారు? నిజాన్ని గోతిలో పెడతారా? లేక పుల్లలతోటి కాలుస్తారా, ఆధ్యాత్మిక మార్గంలో కోరికలు జోలికి వెళ్ళకండి. మీ ప్రయాణం మీరు చెయ్యండి. ఆ నిద్రలోని స్థితిని జాగ్రదావస్థలోకి తెచ్చుకోండి. మీరు రాగ ద్వేషాలని జయిస్తారు.

**ఓం శంభో శివ శివ శివ శివ శివ శివ**

**నారాయణ నారాయణ నారాయణ నారాయణ**

**ఓం శంభో శివ శివ శివ శివ శివ శివ**


**నారాయణ నారాయణ నారాయణ నారాయణ,**

**నారాయణ నారాయణ నారాయణ నారాయణ.**

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724** (**IFSC Code : UBIN0916137**) నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహత్త్మ్యం అక్షరమణమాల

సేకరణ: రాజేశ్వరి గారు, హైదరాబాదు

**కన్నుకు కన్నయి కన్ను లేక కను నిన్**
**కనువారెవరు కనుము అరుణాచలా! ।15।**

**తాత్పర్యము :** స్వశక్తితో చూసేశక్తిలేని మా కళ్ళకు ఆ చూసేశక్తి యిస్తున్న నీవు, కళ్ళు లేకుండానే చూడగలవు. అట్టి చైతన్యస్వరూపుడవైన నిన్ను చూడగలవారు ఎవరైనా ఉన్నారేమో చూడు అరుణాచలా! (ఎవ్వరూ లేరు). మా కళ్ళకి వెలుగు నీవు. మా కళ్ళల్లో చూసేశక్తి నీవు. అటువంటి నువ్వు కళ్ళు లేకుండానే చూడగలవు. భగవంతుడు కళ్ళు లేకుండా చూడగలడు, చెవులు లేకుండా వినగలడు, కాళ్ళు లేకుండా నడవగలడు, చేతులు లేకుండా పని చేయగలడు. అంటే మాకు కళ్ళు ఉన్నాయి. కళ్ళు లేకపోతే ఏమీ చూడలేము మేము. నువ్వు కళ్ళు లేకుండా మమ్మల్ని అందరినీ చూస్తున్నావు. మా మనస్సులో ఏముందో మా హృదయములో ఏముందో నువ్వు చూస్తున్నావు. లోకములో ఎక్కడ ఏది జరిగినా నీ కళ్ళు మూయలేము. మా లోపల ఏముంది, బయట ఏముంది, లోకములో ఎక్కడ ఏది జరుగుతోంది, చూస్తున్నావు. ఏ మనిషి హృదయములో ఏముంది; ఆ దేహాన్ని ప్రారబ్ధాన్ని అనుసరించి ఎలా ఆడించాలి; అని నీకు కళ్ళు లేకపోయినా మమ్మల్ని అందరినీ చూస్తున్నావు. కళ్ళు లేకుండా చూసే నిన్ను చూడగలమా మేము! అలా కళ్ళు లేకుండా చూస్తున్న నిన్ను, చూడగలిగిన వారు మాలో ఎవరైనా ఉన్నారేమో చూసి చెప్పవయ్యా అరుణాచలేశ్వరుడా! ఉన్నారా అంటే లేరని అర్థం. లేరు అని చెప్పటానికి చూడు అన్నాడు. ఆత్మని తెలుసుకోవటం, ఆత్మని చూడటం అంటే ఆత్మగా ఉండటం. చైతన్యాన్ని చూడటం అంటే చైతన్యంగా ఉండగలగటమే. అలా ఎవరైనా ఉన్నారా? చైతన్యాన్ని మన మనస్సుతోటి తెలుసుకోలేము. చైతన్యం మనస్సుకు ఆబ్జెక్ట్ కాదు. మనస్సు కనుక చైతన్యంలో కరిగిపోతే, అది వ్యక్తం అవుతుంది. అణిగిన మనస్సుతో కూడా నువ్వు దానిని తెలుసుకోలేవు. మనస్సు ఎక్కడైతే కరిగిపోతుందో, అక్కడ అది తెలియబడుతుంది. అది తెలియబడితే అనుభవం కలుగుతుంది.

ఓ అరుణాచలేశ్వరుడా, కళ్ళు లేకుండా చూసే నిన్ను చూడగలిగిన వాడు ఈ లోకంలో ఎవడైనా ఉన్నాడా, వాడిని నువ్వు చూడు అరుణాచలేశ్వరుడా. ఒక్క జ్ఞాని తప్పించి, ఒక్క బ్రాహ్మీస్థితి పొందిన వాడు తప్పించి వాడిని చూడటానికి ఎవడూ సరిపోడు. ఒక బ్రాహ్మీస్థితి పొందిన వాడికి అరుణాచలేశ్వరుడి వైభవం తెలుస్తుంది కానీ మనకి తెలియదు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥2-46॥**

**తాత్పర్యము:** అన్ని వైపులా జలములతో నిండి ఉన్న మహా జలాశయము అందుబాటులో ఉన్నవానికి చిన్న చిన్న జలాశయముల వలన ఎంత ప్రయోజనమో, పరమాత్మ ప్రాప్తినంది పరమానందమును అనుభవించు బ్రహ్మ జ్ఞానికి వేదముల వలన అంతియే ప్రయోజనము.

ఇంటిదగ్గర మంచి నీళ్ళు దొరకకపోతే కుళాయి దగ్గరకి వెళ్ళి నుంచోవాలి, లేకపోతే చెరువు దగ్గరికి వెళ్ళాలి తెచ్చుకోవటానికి. చెయ్యి ఎక్కడ పెడితే అక్కడ మంచి నీళ్ళు దొరుకుతా ఉంటే, నీకు కుళాయి తోటి చెరువుతోటి నది తోటి పని ఏముంది. ఒకవేళ మీ ఇంటిలో కుళాయి ఉన్నా, నువ్వు చెరువు తవ్వించుకున్నా, వాటి వల్ల నీకు ఏమైనా ప్రయోజనం ఉందా. ఎక్కడికీ కదలకుండా కూర్చుని చెయ్యి ఇలా పెడితే నీకు మంచి నీళ్ళు దొరుకుతూ ఉంటే, మీ ఇంటిలో బిందెలతో ఉన్న నీళ్ళతోటి పనేముంది. చెయ్యి ఇలా పెట్టి నీళ్ళు తాగుతావు. చెయ్యి ఎక్కడ పెడితే అక్కడ నీళ్ళు అందుతాయి నీకు. ఇంక చెరువు తోటి, కుళాయి తోటి నీకు ప్రయోజనం ఏమిటి? వీటివల్ల ఏమైనా ఉపకారం ఉందా!

చెయ్యి ఎక్కడ పెడితే అక్కడ నీళ్ళు దొరికే వాడికి చెరువుతోటి కుళాయిల తోటి ఎలా సంబంధం లేదో, అలాగే బ్రహ్మానందం పొందిన వాడికి, ఆత్మానందం పొందిన వాడికి బయట సుఖాలతో, బయట భోగాలతోటి, బయట విషయాలతోటి సంబంధము లేదు!

నీకే పంచదార మిల్లు ఉంటే, పంచదార కోసం కొట్టుల చుట్టూ తిరగటం ఎందుకు?

నువ్వే సుఖం అయిపోతే, ఇంకా సుఖాల కోసం బయట తిరగటం ఎందుకు? నువ్వు ఎక్కడ చెయ్యి పెడితే అక్కడ నీళ్ళు అందుబాటులో ఉన్నాయి. ఇంక నీకు కుళాయి తోటి, నది తోటి, చెరువుల తోటి పని ఏమీ లేదు కదా!

స్వతంత్రమైన సుఖం, స్వతంతమైన శాంతి, స్వతంతమైన ఆనందం మనుషుల మీద ఆధారపడి ఉండదు. మీకు అర్థం అవుతోందా? వాళ్ళకి కోపం వస్తే మనకి సహాయం చెయ్యరేమో అని ఇలా అనుకుంటాము కదా. కాని ఆ సుఖం మనుషులతోటి, వస్తువుల తోటి, ప్రపంచం తోటి సంబంధం లేదు. చుట్టాలని స్నేహితులు అని ఎవరితోటి సంబంధం లేదు. మీకు శరీరం ఉన్నా లేకపోయినా స్వతంత్రమైన సుఖం, స్వతంత్రమైన శాంతి, స్వతంత్రమైన ఆనందం నీకు కలిగినప్పుడు, నీ హృదయంలోనుంచి ఆనందం కెరటాల కింద వచ్చేస్తా ఉంటే, బయట ఉన్న భోగాలతోటి నీకు పనేముంది! కొంతమంది భరించలేరు ఆ సుఖాన్ని, అట్టిది ఆ సుఖం!

సముద్రంలో ఎంత నీరు ఉందో అంతకంటే ఎక్కువగా నీ హృదయములో శాంతి ఉంది. అయితే నీకు అది ఓపెన్ అవ్వటం లేదు. హృదయంలోనుంచి బ్రైన్ లోకి ఒక నాడి ఉంటుంది. దానిని అమృతనాడి అంటారు. అమృతనాడి ఓపెన్ అవ్వాలి. అది ఎప్పుడు ఓపెన్ అవుతుందో మనకి తెలియదు. కానీ, అది ఉంది. ఆ నాడి ఓపెన్ అయినప్పుడు, గోదావరి గట్టు తెగిపోతే నీళ్ళు ఎలా వచ్చేస్తాయో, హృదయంలో ఉన్న ఆనందం వచ్చి సడన్‌గా మీ శిరస్సు అంతా ముంచేస్తుంది. నువ్వు మునిగిపోతావు ఆ ఆనందంలో. ఇంక వాడికి పునర్జన్మలు ఏంటి? ఆ నాడి ఓపెన్ అవ్వాలి. అయితే మన ఇష్టం కాదు. మన తెలివితేటల వల్ల ఓపెన్ అవ్వదు. గురువు అనుగ్రహం ఉండాలి, ఈశ్వరుని అనుగ్రహం ఉండాలి. ఒక ఉపనిషత్తులో ఋషి పొంగిపోయి చెపుతాడు ఇక్కడ - ఆ నాడి ఓపెన్ అయితే నువ్వు భరించలేనంత ఆనందం వచ్చి నీ శిరస్సుని ముంచేస్తూ ఉంటుంది. అప్పుడు నీకు శరీరం తోటి పనేముంది, ప్రపంచం తోటి పనేముంది, మనస్సుతోటి పనేముంది, దేవుడితోటి మట్టుకు మీకు పనేమిటి! మీకు అర్థం అవుతోందా?

ఆ అమృతనాడి ఓపెన్ అయినప్పుడు, 'హి ఈజ్ బాడీలెస్ మైండ్ లెస్, వరల్డ్ లెస్ అండ్ గాడ్ లెస్ ఆల్సో'!

ఆ ఉపనిషత్తు ఋషి పొంగిపోతాడు ఈ వాక్యం చెప్పేటప్పుడు. ఇప్పుడు మీ ఇంటిపక్కన పది మంది డాక్టరులు ఉన్నారు, నీ శరీరం ఎప్పుడూ ఆరోగ్యముగా ఉంటుంది, వాళ్లతోటి నీకు పనేమిటి? నీకు రోగం లేనప్పుడు, డాక్టర్ తోటి నీకు పనేమిటి. ఒకవేళ నిజంగా దేవుడు ఉన్నా, అమృతానుభవం నీకు వచ్చినప్పుడు ఆ దేవుడి తోటి నీకు పనేముంది! అమృతానుభవం

పొందిన వాడికి దేవుడు ఉన్నాడా లేదా అని అసలు సంశయం అనేది అక్కరలేదు. దేవుడు ఉన్నా, ఆయనతోటి నీకు పని లేదు. వచ్చి నీ పక్కన కూర్చునా, నువ్వు కోరికలు కోరటానికి, నీకున్న ఆత్మానుభవం, నీకున్న ఆత్మశాంతి, ఆత్మజ్ఞానం ముందు ప్రపంచంలో నువ్వు కోరదగిన కోరిక ఏమీ ఉండదు. ఈవేళ పచ్చగా ఉంది రేపు ఎండిపోయే కోరికలు నువ్వెందుకు కోరుకుంటావు.

అందుచేత, అమృతానుభవం ఎవడైతే పొందాడో, అంటే ఈ నాడి ఓపెన్ అయ్యిన తరువాత అమృతం మెదడుకి అందుతా ఉంటే, వాడికి భగవంతుడు ఉంటే ఏంటి లేకపోతే ఏంటి! శరీరం, మనస్సు, భోగాలు ఉంటే ఏంటి లేకపోతే ఏంటి! దేవుడితోటి కూడా పని లేదు అది అమృతత్త్వం! దేవుడే వచ్చి పక్కన కూర్చున్నా, ఆ దేవుడిని ఏమీ అడగాలని ఉండదు. అంటే దేవుడి మీద నీకు కోపం కాదు, అడగకూడదు అని కాదు. అవసరం లేక! అవసరం లేనప్పుడు, అసలు నువ్వు అడగవలసిన వస్తువు ఏమీ మిగలనప్పుడు, దేవుడు వచ్చినా, నీకు పనేమిటి దేవుడితోటి? అలా వర్ణిస్తాడు ఆ ఋషి.

శరీరం చనిపోతున్నప్పుడు, శరీరంతో కనెక్షన్ తెగిపోయినా మనము ఉన్నాము అనే అనుభవం ఎవడికైతే ఉందో, వాడు గాడ్ లెస్ బాడీ లెస్ మైండ్ లెస్ అండ్ వరల్డ్ లెస్ ఆల్సో! వాడికి ప్రపంచం ఉన్నా లేనివాడితోటి సమానం, దేహం ఉన్నా లేనివాడితోటి సమానం. ఇవన్నీ ఒట్టి ఒట్టి మాటలు కాదు. మీకు అనుభవంలోకి రావాలి. ఒట్టి మాటలతోటి ఏముంది. ఇది మీకు అనుభవంలోకి వచ్చినప్పుడు, ఆత్మ జ్ఞానం కలిగినప్పుడు అమృతానుభవం పొందినప్పుడు మీకు ఏనుగు మీద కూర్చునట్టు ఉంటుంది.

అమృతస్థితి, అమృతానుభవం గురించి మానేసి ఒకసారి భగవాన్‌ను ఏదో చిల్లర గొడవలు అడుగుతున్నారు. కోరికలు ఎలా నెరవేరుతాయి, కొండ చుట్టూ ఏ వారం తిరిగితే ఏ లాభం కలుగుతుంది, ఇలా పురాణాలలో రాసిన గొడవలు అడుగుతున్నారు. అప్పుడు ఆయన ఒక మాట అన్నాడు, ఏనుగు మీద కూర్చున్న వాడికి గాడిద మీద ఊరేగుదామని ఉంటుందా! ఏనుగు మీద కూర్చుని తిరిగే వాడు, సరదా కోసం గాడిద మీద తిరుగుదామని అనుకుంటాడా! అసలు ఆ కోరిక వస్తుందా! ఎంతసేపూ ఈ చిల్లర గొడవల తోటి సరిపెడుతున్నారు ఏంటి మీరు! ఏనుగు మీద తిరిగేవాడు ఎవడూ గాడిద మీద తిరగడు. ఆత్మస్థితి ఆత్మానుభవం పొందినవాడికి మీరు అడిగే చిల్లర ప్రశ్నలు అక్కరలేదు అన్నారు. శుక్రవారం అది, శనివారం ఇది, పూజ చేయండి, వ్రతం చేయండి మీకందరికీ డబ్బు వచ్చేస్తుంది, ఈ గొడవలు ఏమీ ఉండవు. అది నిజమే అయ్యివుండవచ్చు. కాని ఆత్మానుభవం పొందిన వాడికి, అసలు ప్రపంచమే లేని వాడికి, ఈ గొడవలతో పనేమిటి!

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# సద్గురు ప్రసాదం

దిll 23-09-2021న సద్గురు శ్రీ నాన్నగారి జయంతి జరుపుకోబోతున్నాం. దిll23-09-1934న దేహము ధరించి, తరువాత కాలములో భగవాన్ శ్రీరమణ మహర్షిచే ఎన్నుకోబడి దిll 29-12-2017న మహాసమాధి చెందే వరకూ జిన్నూరు కేంద్రముగా, సుమారు నలుబది సంవత్సరములు, భగవాన్ శ్రీరమణమహర్షి బోధామృతమును, సరళమైన భాషలో, అందరికీ అర్థమయ్యేరీతిలో ప్రవచించిన మహోన్నతుడు, సద్గురు శ్రీనాన్నగారు. ప్రతిఫలాపేక్షలేని అనుపమానమైన గురుస్థానం వారిది! శ్రీనాన్నగారు సార్థకనామధేయులు, ఆయనకు నాన్నగారు అని పేరుపెట్టుకున్న భక్తశ్రేణి అభినందనీయులు. ఎవరూ నొచ్చుకోకుండా, ప్రేమతో అందరినీ పలుకరించి, వారి వారి మనోమాలిన్యాన్ని, వాసనలను క్షాళన చేసి, పరివర్తన తీసుకురావడం శ్రీనాన్నగారి ప్రత్యేకతగా ఉండేది. ప్రేమను, స్నేహాన్ని, అందరికీ సమానముగా పంచేవారు. సకల జీవసమానత్వం, విశ్వప్రేమ, నిరాడంబరత్వం, గురుభక్తి, మున్నగునవి తన జీవితంలో ఆచరణలో పెట్టి చూపారు. నిష్కామమైన మనస్సుతోటి, బుద్ధితోటి, ప్రతీ పనీ చేసేవారు. ఆ కాలములో శ్రీనాన్నగారి దర్శనానికి, సత్సంగాలకు అందరూ అర్హులే! గాలి, వెలుతురు, నీరు, సహజంగా అందరికీ ఎలాగైతే అందుబాటులో ఉంటాయో, అదేవిధముగా ఆత్మ విద్యను మనందరికీ అందుబాటులోకి తెచ్చి బోధించారు. అమూల్యమైన జ్ఞాన సంపద అక్షరరూపంలో 'రమణ భాస్కర' పత్రిక ద్వారా నేటికీ అందింపబడుతూ, పాఠకులకు ఆత్మానందాన్ని ప్రసాదిస్తోంది. "దేహము జీవించి యుండగానే, దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందడమే, ఈ పుట్టుక ప్రయోజనం. ఏ మార్గాన్ని అవలంబించినా, అద్వైతానుభవమును పొందాలి. వాస్తవంగా తాను ఎవరో? తెలుసుకొని, ఆత్మతత్త్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి" అన్నదే నాన్నగారి బోధాసారం! మహాత్ముల జీవిత విధానము, మరియు వారి అమూల్య బోధ నుండి జ్ఞానరత్నాలను స్వీకరించి, వాటిని ఆచరించుటకు ప్రాముఖ్యతనివ్వాలి. మనందరికీ, అదేవిధముగా రాబోయే తరాలకు, చిరస్మరణీయులు, మార్గదర్శి శ్రీనాన్నగారు! వారి కృప, అనుగ్రహ దృష్టి, సదా మనపై ప్రసరించుగాక!

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ప్రాప్తించినదానికి తల ఒగ్గు - అదే శరణాగతి

మనం అనుకొనే బంధుమిత్రులు అనేవారు అంతా ఎండిపోయిన పాత బావులు. పరీక్షా సమయంలో ఒక్కరు కలసిరారు. కానీ మనం వారే ఆదుకొనేవారని కర్తవ్య బంధం అంటూ కలలు కంటాము. డొక్క పడిపోయే సమయంలో మన కర్తవ్యం అనే దానికి అంతేలేదు. ఒకసారి సాయంచేసి భ్రాంతిని కల్పించుకోకూడదు. ఇది శాఖోపశాఖలుగా వ్యాపించే మర్రిచెట్టువంటిది. ఏది ఏ సందర్భంలో భగవంతుడు సమకూరుస్తాడో దాన్ని ఆనందంగా స్వీకరించాలి. ఉడిపిలో కాషాయ వస్త్రాలతో ఉన్న సన్యాసులు హోటల్ ముందుగాని, దేవాలయాల ముందుగాని, యాత్రికుల ముందుగాని చేయి చాచరు, ముఖం చూడరు, దగ్గరకు వచ్చి ధనం ఇస్తే స్వీకరిస్తారు. వారి భావన యాచించినా ఇయ్యరు అందరూ. ఈశ్వరుడే వాళ్ళకు ధనం ఇయ్యాలి అని వారిని ప్రేరేపిస్తే వాళ్ళే ఇస్తారు అని ఆ సాధువుల భావన. అదే శరణాగతి. ఈ శరీరం పాతబడ్డ పనికిమాలిన గాధ. వర్తమానకాలమే ఉనికిలో ఉంది. ఈ శరీరాన్ని ఎక్కడికైనా ఈడ్చబడితే దాన్ని పోనిమ్ము. షేక్స్పియర్ ఒక పాత్రలో ఇలా అంటాడు "నేను ఇంటి నుంచి బయటకు పోవలసి వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. ఏదో శక్తి నన్ను బయటకు గెంటింది'' అనిపిస్తాడు. రామకృష్ణపరమహంస "అమ్మా నేను నీ శరణాగతుడను, దేహ సుఖం నాకు అక్కరలేదు, పేరు, ప్రతిష్టలు, అష్టసిద్ధులు అక్కరలేదు. కామినీ కాంచనలపై ప్రీతిలేకుండా చెయ్యి, నీ పాద పద్మములయందు శుద్ధ భక్తిని, నిష్కామం, అమలం, అహేతుకం అయిన భక్తిని అనుగ్రహించు. నీ కంటే నాకు దిక్కు ఎవరు? సాధనా హీనుడను నీ పాదములయందు భక్తిని ప్రసాదించు" అనేవారు. మనం గతం తాలూకు చేదు అనుభవాలు మనస్సు నుంచి వదిలించుకోవాలి. ఏవి క్షమించాలో వాటిని క్షమించాలి. ఇనుమడించిన ఉత్సాహంతో జీవించాలి. అప్పడే విరబూసిన పుష్పంలా ఉండగలము. జీవితంలో ప్రతీ క్షణాన్ని కొత్త ఆశతో అందుకోవాలి, ఆస్వాదించాలి. జీవితంలో ఒక తేనెటీగలా ఉండటం నేర్చుకోవాలి. అలాగే మనం ఎక్కడ ఎవరు తారసపడ్డా వారిలో చెడును వదిలేసి కేవలం మంచినే గ్రహించాలి. మన గుండెల నిండా ప్రేమను భగవంతుని పట్ల కృతజ్ఞతాభావాన్ని నింపుకోవాలి. జీవితం అనేది మనకు అవసరమైనదే ఇస్తుంది. మనం కోరుకొన్న ప్రతీదీ ఇవ్వదు. ఈ విషయం అతి ముఖ్యంగా సాధకుడు గ్రహించాలి. జీవితం తనదైన వివేకంతో ముందుకు సాగాలి. చాలా సందర్భాలలో అది మన స్వల్ప బుద్ధికి అర్థం కాకపోవచ్చు. కాబట్టి జీవితంలో ఎలాంటి సంఘటనలు, సందర్భాలు ఎదురైనా వాటిని అంగీకరించాలి. అంటే నీ ఇష్టమే నా ఇష్టం అని ముందుకు సాగటం నేర్చుకోవాలి. అదే ఆనంద రహస్యం. శ్రీనాన్నగారు "తృప్తి గలవాడిదే జన్మ" అన్నారు. తృప్తిపడిన వానికి గంజి మెతుకులు లభించినా పరమాన్నంగానే భావిస్తాడు. తృప్తి ఉంటే కోరికలు పలాయనం చిత్తగిస్తాయి. తృప్తిలో అనంతమైన ఆనందం దాగి ఉంది.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966